Reg. No. 1118.

Founder: K. NAGESWARA RAO

ఆంధ్రపత్రిక

విడిపత్రిక అణా.

Editor: S. SAMBHU PRASAD.

Vol. 29. * ANDHRA PATRIKA, MADRAS, THURSDAY, 10-9-42 * No. 152

315446

దేశాయి చనిపోయినప్పుడు సేవాగ్రామకు మహాత్ము నితంతి

సర్ కూర్మా వెంకటరెడ్డినాయుడు మరణం

మద్రాసుగవర్నరుగా పనిచేసినవారు

ప్రఖ్యాత విద్యావేత్త, రాజకీయవేత్త

మద్రాసు, సెప్టెంబరు 10:—

సర్ కూర్మావెంకటరెడ్డినాయుడుగారు కే. సి. ఐ. ఇ., కే.టి. బి. ఏ. బి. ఎల్. డి. లిట్, యం. యల్. సి. అన్నామలై విశ్వవిద్యాలయ వైసుఛాన్సలరు:—త్యాగరాయనగరులో బోగరోడ్డులో స్వగృహమున యీతెల వారుకట్ల 1 గంటకు చనిపోయిరని తెల్పుటకు చాల విచారమగుచున్నది. వారికి చనిపోవునప్పటికి 67 సంవత్సరములు.

సర్ కూర్మారెడ్డినాయుడుగారు చిదంబరంనుంచి 2వ తేదీ ఉదయం మద్రాసు వచ్చిరి. చెట్టినాడు హౌసులో జరిగిన అన్నామలై విశ్వవిద్యాలయం సిండికేటు సమావేశానికి హాజరైరి. సాయంత్రం యింటికి జబ్బుతోవచ్చిరి. ఆజబ్బునుంచి కోలుకోలేకపోయిరి.

వారు చనిపోయేటప్పుడు వారి పెద్ద అప్పగారు లక్ష్మీనరసమ్మగారు వారి భార్య లక్ష్మీకాంతమ్మగారు, చిన్న కుమారుడు మదనగోపాలస్వామిగారు, యిద్దరు కొమార్తెలలో ఒకరగు శ్రీమతి కమలమ్మగారు ఉండిరి.

గుంటూరులో ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రారుగా ఉన్న శ్రీ కే. వి. గోపాలస్వామినాయుడుగారికిని, వీహారులో ఉన్న రెండో కుమారుడు కే. వి. రాజగోపాలస్వామిగారికిని, కావలిలో జిల్లా మునసబుగా ఉన్న అల్లుడు యస్. నారాయణరావుగారికిని వెంటనే మరణవార్త తెలియజేయబడెను.

జీవితవిశేషములు

సర్ కూర్మా వెంకటరెడ్డినాయుడు ఆంధ్రదేశంలో సుప్రసిద్ధమైన కాపువంశమున 1875 వ సంవత్సరమున ద్రాక్షారామంలో జన్మించిరి. రాజమహేంద్రవరం ఆర్ట్సుకాలేజిలోను, మద్రాసు క్రిస్టియనుకాలేజిలోను, లాకాలేజిలోను విద్యనభ్యసించి న్యాయవాదవృత్తియందు పేరు సంపాదించి ప్రజాహిత జీవితమునం దున్నతిని బడసిరి. వారు స్థానిక స్వపరిపాలనమునందెంతో శ్రద్ధ వహించి పనిచేసినవారు. అమలాపురం మ్యూనిసిపలు కౌన్సిలు సభ్యుడుగానుండి 1903లో తాత్కాలికంగా చైర్మనుపని చేసిరి. అపుడక్కడికి మద్రాసు గవర్నరులార్డుఆంప్తిలు రాగా సన్మానపత్రమును గూడ సమర్పించిరి. వారు పోలవరం తాలూకాబోర్డులోను కృష్ణా, గోదావరి జిల్లాబోర్డులలోను, ఏలూరు మ్యునిసిపలు కౌన్సిలులోను సభ్యులుగా నుండి పనిచేసిరి. 1919 లో భారతప్రభుత్వ సంస్కరణముల జాయింటు పార్లమెంటరీ కమిటీవద్దకు బ్రాహ్మణేతర రాయబారమునకు నాయకత్వము వహించిరి. 1920 లో కొంతకాలము ఇంపీరియలు లెజిస్లేటివు కౌన్సిలు సభ్యులుగా నుండిరి. తరువాత మద్రాసు శాసనసభ సభ్యులుగా రెండుసార్లు యెన్నుకొనబడి 1920 నుండి 1926 వరకు శాసనసభ్యులుగా నుండిరి 1920-1923 మధ్య మద్రాసుప్రభుత్వ స్వయపాయ పారిశ్రామిక శాఖామంత్రిగ పనిచేసిరి. మద్రాసు విశ్వవిద్యాలయ సభ్యులుగాను, ఆంధ్ర విశ్వవిద్యాలయం సిండికేటు సభ్యులుగను ఉండిరి. 1928 లో జెనీవాలోని జాతిసమితి అసెంబ్లీకి భారతప్రభుత్వ ప్రతినిధిగా నియమింపబడిరి.

1929 లో దక్షిణాఫ్రికా యేజెంటు జెనరలుగా శ్రీ. ఆ. వి. శ్రీనివాసశాస్త్రిగారితరువాత నియమింపబడి అక్కడ 1932 దాకా పనిచేసిరి. 1933 లో బిసిస్సా పరిహార్య సమస్యను గూంచి రౌండుటేబిలు కాన్ఫరెన్సు యెదుట సాక్ష్యమునిచ్చిరి.

1933 లోనే స్టేటుకౌన్సిలు సభ్యులుగా నియమింపబడిరి. 1934లో మద్రాసుప్రభుత్వ కార్యనిర్వాహక సంఘసభ్యుడుగా నియమింపబడిరి. 1936లో ఎస్కిమనుప్రభువు సెలవుమీద పోయినపుడు నాలుగు మాసములు గవర్నరుగా పనిచేసిరి. 1927 లో మద్రాసులో కాంగ్రెసు పార్టీ కొత్త సంస్కరణలు వచ్చినపుడు మంత్రిపదవిని నిర్మించనపుడు, ఆ మధ్య కాలంలో ప్రభుత్వాన్ని స్థాపించినపుడు సర్ కే. వి. రెడ్డిగారు ప్రధానమంత్రిపదవి నంగీకరించిరి.

సర్ కూర్మా వెంకటరెడ్డిగారు గొప్ప విద్యావేత్తలు. నూటికి నూరుమంతులు ఆంధ్రులు. ఆంధ్రభాషాపాండిత్యము గలవారు. తెలుగులో అనర్గళముగా నుపన్యాసము లిచ్చెడివారు. రాజమహేంద్రవరం ఆర్ట్సు కాలేజిలోను, మద్రాసు లా కాలేజిలోను కొంతకాలము లెక్చరరుగా పనిచేసిరి. ఆంధ్ర మద్రాసు విశ్వ విద్యాలయముల సెనెటు సభ్యులుగా నుండిరి.

1940 లో. ఆ. శ్రీనివాసశాస్త్రిగారి స్థానే అన్నామలై విశ్వవిద్యాలయం వైసుఛాన్సలరుగా పనిచేయుట కంగీకరించి ఆ పదవియం దుండియే నేడు జీవితమును చాలించిరి.

ఈ మధ్యనే సర్ మహమ్మదు ఉస్మాను గారిని భారతప్రభుత్వ కార్యనిర్వాహక సభ్యులుగా నియమించటంవల్ల ఖాళీపడిన స్థానమునందు నేమవలు డిఫెన్సు కౌన్సిలు సభ్యులుగా నియమింపబడిరి కాని జబ్బుగా నుండుటచేత గతవారము జరిగిన సమావేశమునకు ఢిల్లీకి పోలేకపోయిరి.

నేడుదయము మృతకళేబరమును జూచుటకు సర్ ఏ. పి పాత్రో, టి. ఆస్టిను, హార్వేను, జే. వెంకటనారాయణనాయుడు, గోపతినారాయణస్వామిచెట్టి, పి. వెంకటరమణరావునాయుడు, టి. టి. కృష్ణమాచారి, రావుబహదూర్ జి. ఏ. నటేశన్, అబ్దుల్ హమీదుఖాన్, డా॥ బి. వి. నారాయణస్వామి, డా॥ ఏ. లక్ష్మణస్వామి మొదలయ్యారు గారును, మద్రాసుకార్పొరేషను మేయరు చక్రయ్యచెట్టిగారును, కమీషనరు పుల్లారెడ్డి గారును, పి. కామేశ్వరరావుగారును, మరి యెందరో వచ్చిరి.

సర్. కే. వి. రెడ్డినాయుడుగారి జ్యేష్ఠ పుత్రులు ఆంధ్ర విశ్వవిద్యాలయం రిజిస్ట్రారు కే. వి. గోపాలస్వామిగారు యీ ఉదయమే గుంటూరునుండి వచ్చిరి. అంత్యక్రియలు సాయంత్రం 5 గంటలకు జరుగును.

సర్ అల్లాడిగారి ప్రశంస

సర్ కూర్మారెడ్డి నాయుడుగారి మరణమునకు విచారము దెల్పుచు అడ్వొకేటు-జెనరలు సర్ అల్లాడి కృష్ణస్వామి అయ్యగారు మా బిలేఖరితో యిట్లు చెప్పిరి:—

"ఆంధ్రదేశమునకు భారతదేశమునకు గూడా సర్ కూర్మారెడ్డిమరణముతో పెద్దలోటు కలిగినది. వారు ఆంధ్రులలో సుప్రసిద్ధులుగనుండి, యెన్నియో ఉన్నతపదవులను బడసి, వాని నతిసమర్థతతో నిర్వహించిరి. మద్రాసు ప్రభుత్వ కార్యనిర్వాహక సంఘసభ్యులుగను, మంత్రిగను పేరుగాంచిరి

మద్రాసు, సెప్టెంబరు 10:—

మద్రాసు విశ్వవిద్యాలయం వైస్‌ఛాన్సలరు డా॥ లక్ష్మణస్వామిమొదలియారు, సర్ రెడ్డినాయుడుగారి మరణమునకు విచారము తెలుపుచు వీరు ఎల్లప్పుడు విశ్వవిద్యాలయము, అందలి విద్యార్థుల గురించియే ఆలోచించుచుండెదరనియు, వీరి మరణమువల్ల కలిగినలోటును లోలించుట కష్టతరమైన దనియు చెప్పిరి.

జాతీయదేశరక్షణ సంఘ ఆరవ సమావేశము

ప్రభుత్వ ప్రకటన

ఢిల్లీ, సెప్టెంబరు 8:—

ఇండియా దొరతనంవారి నీలాను పక్క ప్రకటన చేశారు:—

రాజప్రతినిధి అధ్యక్షత క్రింద నిన్న ప్రొద్దున్న ఢిల్లీలో రాజప్రతినిధి మందిరంలో జాతీయ దేశరక్షణసంఘంవారి ఆరవ సమావేశం జరిగింది. భారతనౌకాదళము (రాయలు యిండియను నేవీ)ను గురించి నౌకాదళ సేనానియైన ఫ్లాగు ఆఫీసరుసభలో ఒక స్టేటుమెంటును చదివాడు. ఈ సంఘం వారి కడపటి సభ జరిగిన తరువాత సేనలో చేరిన భారతీయుల సంఖ్యను తెలుపుతూ అడ్డు పెంటు జనరలు సభలో ఒక స్టేటుమెంటును చదివాడు. గత 12 నెలల నుంచిన్ని సేనలో చేరుతూవున్న వారిసంఖ్య వెనుకటికంటె నెలనెలకు హెచ్చుతూనేవున్నది కాని వైద్యశాఖ లెక్కిలకులశాఖలు, సమాస్తాలశాఖమొదలైన వాటిలో యింకా హెచ్చుమందిని చేర్చవలెను- అని సభవారు సూచించారు. వీటిని గురించి చాలసేపు చర్చ జరిగింది.

మధ్యాహ్నము సభలో మిలిటరీ సప్లయిలను గురించి ఆర్డినెన్సు మాస్టరు జనరలు ఒక స్టేటుమెంటును చదివాడు. సెంట్రలు అడ్వైజరీ బోర్డు కొన్సిలువారి కడపటిసభలో చేయబడిన తీర్మానముల ననుసరించి సర్ జోగీంద్రసింగుగారొక స్టేటుమెంటును చదివారు. దీనిని గురించి సభ్యులు చర్చించారు.

అల్లరులనుగురించిన స్టేటుమెంటు

నేడు వుదయమున 10 గంటలకు మళ్లీ సభ జరిగింది. దేశములో జరిగిన అల్లరులను వాటి నడబిపేయుటకు దొరతనము వారు చేసిన యేర్పాటులను గురించి నేడు హోం మెంబరు సభలో ఒక స్టేటుమెంటును చదివాడు. దీనినిగురించి చర్చ జరిగింది. అల్లరులు మిక్కిలి త్వరలో నేపూర్తిగా అడగిపోవుటకు దొరతనమువారు గట్టిప్రయత్నమును చెయ్యవలెనని సభ్యులందరున్ను నొక్కి చెప్పారు.

నేడు- మధ్యాహ్నము సభలో వార్ ట్రాన్సుపోర్టును గురించి హా॥ సర్ ఎడ్వర్డు బెంథాలుగారొక స్టేటుమెంటును చదివారు. కార్మికశాఖ, ఫాక్టరీలలో ఏ. ఆర్. పి. యేర్పాటులు మొదలైనవాటిని గురించి హా॥ అంబేద్కరుగారొక స్టేటుమెంటును చదివారు. తేపు 19 వ తేదీ పొద్దున్న మళ్లీ సభ జరుగుతుంది. (అ. ప్రె.)

ఢిల్లీ, సెప్టెంబరు 9:—

రాజప్రతినిధి భవనంలో రాజప్రతినిధి అధ్యక్షతక్రింద నేడు మళ్లీ సమావేశం డిఫెన్సు కౌన్సిలుసభ జరిగింది. ఈ సభ ఆఖరు సమావేశం జరిగినపిమ్మట యుద్ధ పరిస్థితులలో కలిగిన మార్పులను గురించి ప్రధానసేనాని సభలో ఒక స్టేటుమెంటును చదివాడు. ఇండియాలో దేశరక్షణయేర్పాటులను గురించి సర్. జే. పి. శ్రీవాస్తవగారొక స్టేటుమెంటును చదివారు. తరువాత చర్చ జరిగింది. ధరల నిఘానుగురించి సర్కారుగారొక స్టేటుమెంటును చదివారు ప్రస్తుతం దేశంలో యేర్పడిన స్థితిని గురించి కార్మికుల సంఘముల అభిప్రాయము యుద్ధవార్తలు ప్రచారము మొదలగు వాటినిగురించి కూడా సభవారు చర్చించారు ఈ సెషను నేటితో ముగిసింది. (అ. ప్రె.)

73 శత్రుడివిజనుల నాశనము

మాస్కో, సెప్టెంబరు 10:—

మే 1 వ తేదినుండి ఆగస్టు 31 వ తేదీ వరకు 73 శత్రుసైనిక డివిజనులను మట్టుపెట్టినట్లును మరి 42 శత్రుడివిజనులను 14 టాంకు బ్రిగేడులను విశేష నష్టమునకు లోనైనట్లును రష్యనులు ప్రకటించిరి.

మద్రాసు మేయరు వి. చక్రవైశ్యెట్టిగారు సానుభూతి తెలుపుచు రెడ్డినాయుడుగారు గొప్ప రాజకీయవేత్త విద్యావేత్త యనిరి.

పి. రాజగోపాలాచారిగారు సర్ రెడ్డినాయుడుగారి కుటుంబమునకు సానుభూతి తెలుపుచు సందేశ మంపిరి.

వైద్యులు అన్నివిధాలా సహాయపడిరి

భగవదిచ్ఛ వేరువిధముగా నుండెను

వార్ధా, సెప్టెంబరు 10:—

మహాదేవదేశాయినిర్యాణముగూర్చిగాంధిమహాత్ముడు సేవాగ్రామ ఆశ్రమమునకు పంపిన తంతివార్తప్రతి ప్రకటింపబడినది. ఆతంతివార్తలో మహాత్ము డిట్లువ్రాసెను:—

మహాదేవదేశాయి అకస్మాత్తుగ మరణించెను. మరణమంత సమీపముగనుండెనని ఎట్టిసూచనకూడ కనుపడలేదు. రాత్రి బాగుగ నిద్రించెను. ఉదయం స్వల్పముగ ఆహారం తీసికొని నాతో షికారుకు వచ్చెను. సుశీల (నిర్బంధమునందున్న డాక్టరు నాయరు) జెయిలుడాక్టర్లు శక్తివంచులేక ప్రయత్నించిరిగాని భగవదిచ్ఛ వేరువిధముగ నుండెను నేను, సుశీల శవమునకు స్నానంచేయించితిమి. కళేబరమునకు పాంబ్రాణిపాగ వేసిపువ్వులుంచితిమి. నేను సుశీల భగవద్గీత పారాయణము జరిపితిమి. దుర్గాకు (దేశాయిభార్య) చిరంజీవి బాబ్లుకు (దేశాయకుమారుడు) సుశీల (దేశాయ అన్నకూతురు) కు ఈ వివరాలు తెలుపవలెను. దుఃఖింపవలసిన అవసరములేదు. నాఎదుటనే అంత్యక్రియలు జరుపబడుచున్నవి. అస్థులను నావద్దనే యుంచుకొనెదను.

ఆశ్రమము నందే యుండవలయునని దుర్గాకు హితబోధగావలెను. ఆమెకు ఇష్టములేకున్న ఆమె ఇంటికి ఆమె పోవచ్చును. బాబ్లి ధైర్యముగనుండునని నమ్మకమున్నది.

ప్రేమతో బాపు.

మహాత్ముడు అంత్యక్రియలు జరుపుట

లాహోరు ట్రిబ్యూన్ పత్రిక బొంబాయి విలేఖరి సెప్టెంబరు 8-వ తేదీ ఇలా వ్రాస్తున్నాడు:—

యరవాడకు మైళ్లదూరంలో ముల్లా ముట్టానదీ తీరాన ఉన్న ఆగాఖాన్ గారి నాలుగు అంతస్తుల మేడలో గాంధీజీని నిర్బంధించారు. గాంధీజీతోకూడా కస్తూరిబాయ్ డాక్టర్ సుశీలానాయర్, మీరాబెన్, మిస్. సరోజినీ నాయుడుగారలు ఉన్నారు. ప్రతిరోజూ పూనా సివిల్ సర్జన్ కలనల్ పాల్ పరీక్షచేస్తూ ఉన్నారు. మేడచుట్టూ సాయుధులైన పోలీసులు కాపలా కాస్తూ ఉన్నారు. గాంధిజీ ఆరోగ్యం గురించిన ప్రభుత్వ ప్రకటన కొంత సంతృప్తినీ కల్గించినా, ఇంటర్వ్యూలపై పెట్టబడిన నిషేధాన్ని తొలగించాలని కాంగ్రెసేతరులు కూడా అభిప్రాయపడుతూ ఉన్నారు.

మహాదేవదేశాయ్ ఆకస్మిక మరణము వల్ల కలిగిన దుఃఖాన్ని బాధను దిగమ్రింగి గాంధీజీ నిలబడగలిగినారు. కీర్తిశేషుడైన తన కార్యదర్శిని నిత్యము ఆయన సంస్మరించే విధానం చాలా విసాదకరంగా ఉంటుంది. సూర్యోదయం కాగానే గాంధీజీ మహాదేవ్ దహనస్థలము వద్దకుపోయి కొన్ని పూలను ఉంచి, మహాదేవుని ఆత్మశాంతి కొరకు ప్రార్థనచేస్తున్నారు. గాంధిజీ నిత్యకృత్యాలలో ఇదొకటైంది.

గాంధీజీయే స్వయంగా మహాదేవుని దహనక్రియలను జరిపినారు. ప్రభుత్వము ప్రథమంలో మహాదేవ్ శవమును 'బండ్ గార్డెన్' శ్మశానమునకు పంపించవలెననితలంచినదనిదహనముచేయబడునపుడు తానుండవలయునని గాంధీజీ తెల్పెను. జెయిలు అధికారులు తమపై అధికారులకీ విషయమును తెలియజేసిరి. ఈ విషయంలో ఇండియాప్రభుత్వమే అంత్యనిర్ణయముచేసినట్లు తెలియుచున్నది. హిందువుల శ్మశానవాటికవద్దకు గాంధీజీని వెళ్లనివ్వరాదని ప్రభుత్వము ఉత్తరువుచేసినది. అందుచేత మహాదేవదేశాయ్ శవము ఆగాఖాన్ భవనపు ఆవరణలోనే దహనముచేయబడెను.

యరవాడనుంచి ఎనుమండుగురు బ్రాహ్మణులను, ఒక పురోహితుని తీసుకొనివచ్చారు. హిందూసంప్రదాయము ననుసరించే కర్మచేయబడెను.

"మహాదేవ్ దేశాయ్"కి నేను తండ్రిని, తనయుణ్ణికూడా"అన్నాడు గాంధిజీ చితికి నిప్పంటించుతూ. గాంధిజీ పక్కన కస్తూరీబాయ్, సుశీలానాయర్, మీరాబెన్, సరోజినీనాయుడు, కలనల్ ఫండారీగార్లు నిలబడిఉన్నారు.

కీ॥ శే॥ సర్ కే. వి. రెడ్డి నాయుడుగారు

గవర్నరుగారి విచారం

మదరాసు, సెప్టెంబరు 10:—

గవర్నరుగారు ఈ దిగువ సందేశమును సర్ కె. వి. రెడ్డిగారి భార్యకు పంపిరి:—

నేడుదయం సర్ కె. వి. రెడ్డిగారివారు కబురు విని చాలవిచారించితిని. చిన్నపనుల నుండి గవర్నరుపనివరకు వారు చేసిన సేవ అంతయు అందరికి బాగాతెలుసును. యుద్ధసమయమునందు శాంతిసమయమునందు వారు ప్రభుత్వానికి ప్రజలకు సేవచేయుటయందు వెనుదీయలేదు. చివరకోజున సేషనలు డిఫెన్సు కౌన్సిలులో దేశసేవచేసి సిద్ధంగా నుండిరని గూడ మీయ సగర్వంగా చెప్పుకోవచ్చును. మీకు మీకుటుంబానికి నేను నా భార్య హృదయపూర్వకంగా సానుభూతి దెల్పుచున్నాము. వారు పోయినలోటు యీ రాష్ట్రంలో తీర్చ శక్యంకానిది.

సర్ ఎ. పి. పాత్రోగారు యిట్లు తెలిపిరి:—

కీ॥ శే॥ సర్ కె. వి. రెడ్డినాయుడుగారు, ప్రఖ్యాతిగాంచిన ప్రజాసేవకులు, సమర్థులగు రాజకీయ నాయకులు జస్టిసు ఉద్యమంలో సభ్యులుగనుండి సామాన్య ప్రజల సాంఘిక రాజకీయాభివృద్ధికై యెక్కువ పాటుబడి గ్రామసీమలతో యెక్కువ పరిచయం కలుగజేసుకొన్నారు. తెలుగు ప్రాంతములు తమ శ్రేష్ఠతముల నాయకులందరి అభిమానం చూరగొని, వారి గౌరవమును బడసిరి. వారు మంత్రిగ నుండి పరిశ్రమలకు ప్రభుత్వ సహాయచట్టం, తదితర సహాయ కార్యక్రమములు చేసిరి. ఆంధ్ర మహాసభ తరపున క్రొత్త ఒరిస్సారాష్ట్రము సరిహద్దుల తగవు విషయమున ఆంధ్రమహాసభ తరపున లండనుకి రాయబారంనెళ్ళి తెలుగుదేశం పరులకు పోకుండా కాపాడుటకు ప్రయత్నించిరి. మంచి వక్తలు, ఆర్థికపరిశ్రామిక సమస్యలందు ఎక్కువ శ్రద్ధవహించి విషయ పరిజ్ఞానంతో మాట్లాడువారు ధర్మశుణంగల వారు అనేక మేధావిద్యార్థులకు సహాయం చేయుచుండేవారు. సౌమ్యులు, మిత్రులయెడ మిక్కిలి ఆదరంగల్గి అందరిఆదరణము బడసినవారు. అట్టివారు చనిపోవుట పలువురు మిత్రులకు విచారం కలిగించెను.

రామెలు అనారోగ్యం

క్రొత్త సేనానిని హిట్లరు నియమించునా?

ఈజిప్టు యుద్ధ విశేషములు

అంకారా, సెప్టెంబరు 9:—

ఈజిప్టులో జర్మను సర్వసేనానిగా నుండి అపజయముపాలైన రామెల్ సేనానికి జబ్బుచేసినదనియు, త్వరలో బర్లినుకు పోవునని యు ఈజిప్టులో ఆతని బదులు హిట్లరు క్రొత్తసేనానిని నియమించుననియు టర్కీలో సమాచారము తెలిసినది.

తన కడిఖుజమును బిస్మార్కు మరణించుటవల్ల రామెలుకు విశ్రాంతిలేకపోవుటవల్ల జబ్బుచేసె ననుచున్నారు.

రోం, సెప్టెంబరు 9:—

ఈజిప్టుయుద్ధములో బిస్మార్కు మరణించినట్లు ఇటలీ రేడియోకూడా ప్రకటించినది.

శత్రుటాంకు నష్టము విపరీతము

కెయిరో, సెప్టెంబరు 9:—

శత్రుటాంకులను నలుబదింటని 8 వ బ్రిటిషుసైన్యము నాశనము చేయగలిగెను. మరి అరవై శత్రుటాంకులు తిరిగి ఉపయోగించుటకు వీలులేని రీతిగా పాడయ్యెను. మందుగుండు ప్రదేశములదాటి ఇటాలియనులు ముందుకు పోబోలకపోవుటకు ఇటాలియనుటాంకు నష్టమే కారణము. తనకు టాంకులలో కలిగిన నష్టమును శత్రువు త్వరగా భర్తీచేసికొనజాలడు. బ్రిటిషు టాంకులకు కలిగిననష్టము అత్యల్పము కనుక వారిది పైచేయి గానున్నది. 8వ బ్రిటిషు సైన్యమునకు నాయకులగు మాంట్గొమరీగారు తమ సైనికులలో గొప్ప ధైర్యోత్తేజములను కలిగించిరి.

అతని ఆరోగ్యమును కాపాడుము

హాలిబొరేంజియందుపనిబిడ్డలకండ పుష్టికి, గట్టిపండ్లకు అవసరమైన విటమినులు చేరియున్నవి. అందు చేతనే బహుమతులను పొందగలుగునట్లు శిశువులు యెదుగుదురు. మరియు పెద్దలు, పిన్నలు అంటువ్యాధుల నెదుర్కొనుటకు హాలిబొరేంజి శక్తిని కలుగజేయును.

హాలిబొరేంజి యందు స్వచ్ఛమైన హాలిబట్ లివర్ చమురు, ఎండలో ఆరిన నారింజపండ్ల రసము చేరియున్నవి. అది ఏమాత్రము చేపల వాసన కొట్టదు.

Haliborange

H4i.39

హాలిబట్ లివర్ చమురును సేవించు దివ్యమైన పద్ధతి

తయారుచేసినది అలెన్ అండ్ హాన్‌బరీస్ లిమిటెడ్. (ఇంగ్లండునందు ఇన్‌కార్పొరేటు చేయబడినది.) క్లైవ్ బిల్డింగ్సు, కలకత్తా.

రష్యా-అమెరికా

ముఖ్యమగు సంప్రతింపులు

తూర్పు రష్యాపై జపాను దండెత్తునా?

వాషింగ్టను, సెప్టెంబరు 9:—

అమెరికా సంయుక్త రాష్ట్రములలో రష్యా రాయబారి యగు లిట్వినాఫ్‌గారు అమెరికా సంయుక్తరాష్ట్ర విదేశాంగమంత్రియగు కార్డెల్ హుల్‌గారితో నేడు సంభాషణలు జరిపిరి. రష్యాస్థితి విషమముగా నున్న ఈసమయమున సంభాషణలు జరుపుటలో విశేష ముండితీరవలెనని ప్రముఖులనుకొనుచున్నారు. లిట్వినాఫ్‌గారి నడుగగా వారేమియు బయటపెట్టలేదు. తూర్పు రష్యాపై జపాను దండెత్తుటకు అనుకూలమగు ఋతువు గడచిపోయినది కదా- అని అడుగగా యుద్ధము ఋతువేమల నెరుగదని వారు జవాబు చెప్పిరి.

కామన్సుసభలో ఇండియా ప్రస్తావన

పునస్సమావేశమునకు పూర్వం కామన్సుసభకు విశ్రాంతి

లండను, సెప్టెంబరు 9:—

పార్లమెంటుసభాసమావేశం ప్రస్తుతం జరుగుచున్నది. తిరిగి సమావేశమగుటకు పూర్వము స్వల్పవిశ్రాంతి యుండవలెనను తీర్మానము సభలో ప్రతిపాదింపబడెను. తీర్మానమునకు అనుకూలురు 219, ప్రతికూలురు 7 గురు మాత్రమే. తీర్మానము ఆమోదింపబడెను.

ఇండియానుగూర్చి చర్చిలుగారి ప్రకటన

తిరిగి జరుగబోవు కామన్సుసభా సమావేశములో చర్చిలుగారు భారతదేశ వ్యవహారములగూర్చి ఒకప్రకటన చేస్తారనిన్నీ, ఈ సమావేశములో ఆవిషయమై మాటలాడరనిన్ని కామన్సుసభానాయకుడగు సర్ స్టాఫర్డు క్రిప్సుగారు నేడు కామన్సు సభలో చెప్పిరి.

ఈ సమావేశం వాల్లవగినమున ఒకఅజ్ఞప్తిమెంటు తీర్మానము ప్రతిపాదింపబడును. అప్పుడు భారతదేశవిషయమై చర్చ చేయుటకు సభ్యులకు అవకాశ ముండునని క్రిప్సుగారు సభలో చెప్పిరి.

నిన్నటిదినమున కామన్సుసభలో కనిష్ఠ సభ్యసంఖ్యకూడా లేనందున చర్చ ఏమిన్నీ జరుగలేదు. అందువల్ల కామన్సుసభాకార్యక్రమములో కొంత మార్పుచేయబడెను. ఈ సభా సమావేశములోని కట్టకడపటి దినమునసే చర్చిలుగారు భారతదేశము విషయమై ప్రసంగించెద రని తలంచుచున్నారు.

ఫ్రాంకుఫర్టుపై బాంబులు

జర్మనీపై బ్రిటిషు విమానదాడులు

బర్లిను, సెప్టెంబరు-9:—

జర్మనీ పశ్చిమభాగముపై నిన్న రాత్రి బ్రిటిషు విమానములు బాంబులు వేసినట్లు జర్మను వార్తాసంఘము ప్రకటించెను.

బ్రిటిషు ప్రకటన:—

"రైనులాండులోని ఫ్రాంకుఫర్టుపైన మా విమానికులు తమదృష్టిని కేంద్రీకరించిరి. ఈ ఈపట్టణముపై దాడి జరుపుట కిది 35సారి. పట్టణము గొప్ప రైల్వేకేంద్రము. ఇది నదీతీరపట్టణములలో చాలాపెద్దది. 13 బ్రిటిషు విమానములు తిరిగి రాలేదు. ఈ దాడిలోను జర్మను అక్రమిత ప్రదేశములపై ఎగిరి శత్రు రహస్యములను తెలిసికొను కార్యములలోను బ్రిటిషువిమానములతో కనడా విమానములు కూడ పాల్గొనెను."

చైనా యుద్ధం

చుంకింగు, సెప్టెంబరు 9:—

నైకియాంగు రాష్ట్రములో కిన్హాయాగర సరిహద్దుపట్ట భయంకరయుద్ధము సాగుచున్నట్లు చైనీయుల ప్రకటనలో కలదు.

సొలమనుదీవుల యుద్ధం

వాషింగటను, సెప్టెంబరు 9: —

సొలమన్ దీవులలో జరిగిన నౌకా జర్జి యాదీవులలోని గిజోద్దేశ అమెరికను విమానములు బుధవారం దాడిచేసెను. ఒక జపాను జలవిమానము పడగొట్టబడినది. గూడాల్ కనాల్‌వద్ద జపానుసేనలతో పోరాటము జరుగుచున్నది.

రష్యాలో ఆహారపు కొరత

ఆకలిచావులు

ఆహారపు రేషనులు తగ్గింపు

లండను, సెప్టెంబరు 9:—

రష్యాలో ఆహారపు కొరత యేర్పడినదనియు, ఆకలిచావులు సంభవించుచున్నవనియు, ఆహారపు రేషనులు తగ్గింపబడినవనియు, ఆహారపు కొరతవల్ల

గంటలపంచాంగం

చిత్రభాను సం॥ భాద్రపదము॥ ప్రథమ
1942 సం॥ సెప్టెంబరు 11 శుక్రవారం
శు॥ ప్రా॥ రా॥ 8-31 ఉ॥ రా॥ 2-27 వర్జ్యం ఉ॥ 9-17 మొ॥ 10-55 కు.
శు॥ ద్వితీయ సెప్టెంబరు 12 శనివారం
శ॥ ద్వి॥ రా॥ 7-58 మ॥ రా॥ 2-29 వర్జ్యం ప॥ 10-52 మొ॥ 12-28 కు.

ఆంధ్రపత్రిక
1942-వ సం॥ సెప్టెంబరు 10 తేది గురువారము

రైల్వే రవాణాసమస్యలు

భారత ప్రభుత్వ యుద్ధ రవాణా శాఖ సభ్యుడగు సర్ ఎడ్వర్డు బెంథాల్‌గారు నిన్న ట్రాన్సుపోర్టు సలహాసంఘము నెదుట ప్రసంగించుచు, "దేశమున సరకుల ఉత్పత్తి అధికమైన కొలదియు, రవాణా సౌకర్యముల సమస్య మరింత క్లిష్టమగునే గాని తగ్గద"ని గావించిన హెచ్చరిక, ఇప్పటికైనను బ్రిటిషు అధికారవర్గము నెంతవరకు కదల్చగలదో చెప్పుట కష్టము. శాసనసభలయందును వెలుపలనుగూడ, ప్రజానాయకులీ విషయమై చిరకాలముగ అధికారులను హెచ్చరించుచు, రైల్వే రవాణా సౌకర్యములను అధికమొనర్చుటకును, యుద్ధ పరిస్థితులలో చిక్కుపడకుండజూచుకొనుటకును, రైల్వేలకు అనవసరమగు బండ్లను ఇతరసామగ్రిని, రైల్వే ఇంజనులను ఈ దేశముననే నిర్మించుట కేర్పాటు లొనర్పవలెనని ఎంతయో ఆందోళన మొనర్చుచుండిరి. కాని, అధికారులు మాత్రము మిందుకు ఏమాత్రము ఇష్టపడక బ్రిటనునుండియే ఇంజనులను దిగుమతి చేయుటకు పట్టుపట్టుచువచ్చిరి.

ఇంజనుల నీదేశమున నిర్మించుటయే అసాధ్యమని ఇటీవలివరకును అధికారవర్గమువారి వాదము. కాని, ప్రభుత్వము వారిచే నియమింపబడిన ప్రత్యేకాధికారులే ఈ విషయమై విచారణ సాగించి, "రైల్వే ఇంజనుల నిర్మించుకొనుటకు అవసర మగు సామగ్రి యంతయు నీ దేశముననే లభించు" నని స్పష్టముగ వెల్లడించియుండిరి. ఇంజనుల నిర్మించుకొనుట కవసరమగు ఇనుమును పనిముట్లలో చాల భాగమును ఈ దేశముననే సమృద్ధిగ లభించునని గూడ వారు దెలిపియుండిరి. అజ్మీరునందలి లోకమొటీవు ఇంజనుల కర్మాగారమున మీటరుగాజ్ ఇంజనులను, బ్రాడ్ గాజ్ ఇంజనులను తయారు చేయవచ్చునని అధికారులు గూడ అంగీకరించిరి. కాని, అట్టి నిర్మాణమును ప్రారంభించుటకు అధికారులు ఇంతవరకును ఎట్టి ప్రయత్నములను సాగింపలేదు. సరిగదా, యుద్ధానంతరము గాని అట్టి ప్రయత్నమును దలపెట్టుటకు సాధ్యము గాదనిగూడ మొండికెత్తిరి. నేటి యుద్ధకార్యములకు రవాణాసౌకర్యములకొరకు చిక్కుపడవలసి వచ్చుటకు ఆవిధానమే కారణమని అంగీకరింపక తప్పదు.

బెంథాలుగారి ప్రసంగమును గాంచినచో, నేటికిని ప్రభుత్వవైఖరి మారినటులు గనుపింపదు. ఈ దేశముననే ఇంజనులను తయారుచేయుటకు ప్లానులను తయారు చేయుచుంటి మనియు, కాని అవి చాల కాలమునకు గాని ఉపయోగపడునటులలేదనియు, అందుచే, మిత్రదేశములనుండి ఇంజనులనే దిగుమతి చేసుకొనవలసి యున్నదనియు బెంథాల్‌గారు దెలుపుచున్నారు. దీనికిని, లోకమొటీవు ఇంజనుల నిర్మాణమును సంగ్రామానంతరమువరకు వాయిదావేయుటకును ఎక్కువభేదము గనుపింపదు. వెంటనే ఈ దేశమున ఇంజనుల నిర్మాణమును ప్రారంభించుటకు వీలులేదని బెంథాలుగారేల భావించవలెనో దురూహ్యముగ నున్నది. గత ఫిబ్రవరిమాసమున వైస్రాయ్ సభ్యుడుగ నున్న సర్ ఆంధ్రూ క్లో గారు స్టేటు కౌన్సిలునందు ప్రసంగించుచు "మీటరుగాజ్ ఇంజనులను బ్రాడ్ గాజ్ ఇంజనులను గూడ నిర్మించుటకు సకలసౌకర్యములును గల యంత్రాలయ మొకటి అజ్మీరునందు కలదు"ని అంగీకరించియుండెను. కాని, కొన్నివస్తువులు విదేశములనుండి దిగుమతి గానటనిసి యుండు పుటచే మాత్రమే ఆ ప్రయత్నమును మానుకొనవలసి వచ్చిన దని తెలిపెను. బెంథాల్‌గారిపుడు పూర్తి ఇంజనులను దిగుమతి చేయుటకు సౌకర్యములను గోరుటబదులు ఈ దేశమున లభింపని స్వల్పమగుపరికరములమాత్రము దిగుమతి చేసుకొని, ఇంజనులనిచటనే నిర్మించుకొను టుచితము గాదా? పూర్తి ఇంజనుల దిగుమతి చేసుకొనుటకు నౌకలలో కావలసిన దానికంటె చాల తక్కువస్థలములో, ఎక్కువ ఇంజనులను నిర్మించుకొనుటకు వీలగు సామగ్రిని నీ విధముగ దిగుమతి చేసుకొనవచ్చును గదా.

యుద్ధనిర్వహణకు సరియగు రవాణా సౌకర్యముల ఆవశ్యకతను గురించి ఎంత చెప్పినను అతిశయోక్తి గాదు. ఆయుధపరికరములెంతముఖ్యమో, రవాణాసౌకర్యములంతముఖ్యమైనవి. అందుచేతనే అమెరికాయును బ్రిటనులోనుగూడ, అధికారులు నేటి యుద్ధపు ఒత్తిడి సమయమున గూడ కొత్త రైలు మార్గములను వాని కవసరమగు ఇంజనులను బండ్లను విరివిగ నిర్మించుకొనుచున్నారు. భారత ప్రభుత్వము మాత్రము మింతవరకును ఇందుకు విరుద్ధమగు విధానమునవలంబించుచున్నది. ఈ దేశమున నిదివరకున్న రైల్వేలును, రైల్వే ఇంజనులునుగూడ అసలే తక్కువ. వానిలో కొన్నిటిని, ఇతర యుద్ధరంగములకు పంపిరి. ఆలోటును భర్తీ చేయుటకు మరల కొత్తవానిని దిగుమతి చేయుటకుగాని, ఇంజనులనీదేశమున నిర్మించుటకుగాని ఎట్టి ప్రయత్నములను గావించుట లేదు. సంకుచితమగు నీ విధానమును అధికారవర్గమువారు మార్చుకొనువరకును, సంగ్రామ నిర్వహణమునకును, ప్రజాసౌకర్యములకును గూడ అవసరమగు రైల్వే రవాణా సౌకర్యములను నెలకొల్పుకొనగల్గుట దుస్సాధ్యము.

కీ॥ శే॥ సర్ కె. వి. రెడ్డిగారు

సర్ కూర్మా వేంకటరెడ్డినాయుడుగారు, గతరాత్రి ఆకస్మికముగ స్వర్గస్థులైరని తెలుపుట కెంతయు చింతించుచున్నాము. శ్రీ నాయుడుగారు వారమురోజులుగ రుగ్మతచే బాధపడుచుండినను, ఇంత ఆకస్మికముగ ప్రమాదము సంభవించు నని యెవరును తలచియుండలేదు. వీరి మరణమువలన, చెన్నరాష్ట్రపు, అందు ముఖ్యముగ ఆంధ్రదేశపు ప్రజాహితజీవితమునకు తీరని లోటు వాటిల్లును. శ్రీ రెడ్డిగారు విద్యార్థిదశనుండియు గూడ ప్రజాహితోద్యమములయందు అత్యంతోత్సాహముతో పాల్గొనుచు, ప్రజాసేవాపరాయణత వలనను, ఆంధ్రాంగ్లభాషలయం దనర్గళమగు ప్రాసంగికప్రాభవమువలనను కొలది కాలములోనే, ఆంధ్రదేశమునందలి నాయకవర్గమునం దగ్రశ్రేణి నలంకరించిరి. ముప్పది నలువది వత్సరములక్రింద భారతావని యంతయు నూతన జాతీయ ప్రబోధముచే ప్రచలితమగుచున్న రోజులలో శ్రీ రెడ్డినాయుడు కాంగ్రెసునందు చేరి, ఆంధ్రదేశమున జాతీయోద్యమవ్యాప్తి కొనర్చిన నేనవెవరును మరువజాలరు. అటు పిమ్మట గత 20 వత్సరములలో శ్రీ రెడ్డిగారు కాంగ్రెసునకు దూరమై ఇతర పక్షములయందు జేరి, అనేక సమయములలో కాంగ్రెసును ప్రతిఘటించి, తీవ్రమగు పదముల నుపయోగించినను వారి సద్భావమును, దేశసేవాపరాయణతను యెవరును శంకింప గలుగలేదు. శ్రీ రెడ్డిగారు, తాము నిర్ణయించుకొనిన మార్గమున ప్రజాసేవ నొనర్చుచు, ఈ దేశమున భారతీయులందగల అత్యున్నతమగు పదవి నధివసించి, అధికార గౌరవముల చూరగొనిరి. వీరు ఎంతటి ఉన్నత పదవి నందినను, ఆంధ్రుడనను విషయమును, ఆంధ్రులయెడల తనకు ప్రత్యేకమగు ధర్మముగలదను విషయమును ఏమాత్రమును మరచియుండలేదు. వారి ప్రయత్నము వలన కానిచో, ఆంధ్రదేశ మింకను అనేకవిషయములందు చాల వెనుకబడియుండెడిది. అందుచే శ్రీ రెడ్డినాయుడుగారి సేవను ఆంధ్రులు చిరకాలము కృతజ్ఞతాపూర్వముగ సంస్మరించుచుందురు. వీరి మరణముచే శోకనిమగ్నులై యున్న రెడ్డినాయుడుగారి కుటుంబమునకు హృదయపూర్వకమగు మా సానుభూతిని దెలుపుచున్నాము.

నవరాసిస్కు సగముభాగం శత్రువశమైనది

మధ్యప్రదేశమున స్టాలినుగ్రాడువంకకు రషియను తిరోగమనము

ఉత్తరమునను దక్షిణమునను క్రొత్తరషియను సేనలు జర్మనులతాకిడిని ఓర్చుచున్నవి

మాస్కో, సెప్టెంబరు 10:—

మధ్యప్రదేశమునుండి ఆనగా కలాచ్‌నుండి సూటిగా తూర్పుగా స్టాలిన్‌గ్రాడు నగరమువంకకు గొప్ప శత్రుసేన వచ్చుటవల్ల రషియనులు నగరమ్మువంకకు వెనుకకుతగ్గిరి. ఘోరమగు యుద్ధము జరుగుచున్నట్లు రషియన ప్రకటనలో కలదు.

కాకససురంగంలో నవరాసిస్కు పట్టణములో సగభాగము శత్రువశమం దున్నది' జర్మనులు నగరవాయవ్యభాగములోగూడ ప్రవేశించినట్లు నేటి రషియను ప్రకటన తెలుపుచున్నది.

స్టాలిన్గ్రాడు రంగం

మాస్కో, సెప్టెంబరు 9:—

కలాచ్‌నుండి బయలుదేరి, డాన్, వాల్గా నదులను కలుపు కాలువయొక్క ఒడ్డులమీదుగావచ్చి, రషియనులను ఆక్రమించినవి. శత్రుసేనలు విశేషసంఖ్యలోనికి వచ్చిన ఒక శత్రుసైనిక కంపెనీ సర్వనాశనమైనది. కాని శత్రువుతిరోగమనమును, నగరముదగ్గరకు రషియను తిరోగమనమును తప్పలేదు. రెండు ముఖ్యమగు స్థలములను రషియనులు ఖాళీ చేసిరి. ఇచ్చట సేల సమముగా నుండుటవల్ల శత్రువు ముందుకు త్రోసుకొనివచ్చుటకు ఆటంకములు లేవు. అక్కడికిని రషియనులు అద్భుతముగా పోరిరి. వారి సైన్యముయొక్క పార్శ్వభాగమును భేదించుటకు శత్రువు సుమారు ఆరుసార్లు ప్రయత్నముచేసెను. దాడులకు తిరుగుదాడులు జవాబు చెప్పుచున్నవి. ముందుకు వచ్చిన శత్రువుకు ఒకక్షణమైనను విశ్రాంతిని ఇచ్చుటలేదు. ఉభయపక్షములవారిలో ఒకర్లకన్న ఒకర్లు మిన్నగా వ్యూహములు రచించుచున్నారు. సేనను ప్రక్కలనుండి చీల్చుకొని పోవుటకును సేనను చుట్టివేయుటకును క్రొత్త క్రొత్త యుద్ధతంత్రములను ఇరుపక్షములును అవలంబించుచున్నవి. రషియనులు వెనుకకు తగ్గినను వారిస్థైర్యము ఏమాత్రము తగ్గలేదు.

ఉత్తరమునను దక్షిణమునను

నగరమునకు పడమర పరిస్థితులు పైవిధముగా నుండగా, దక్షిణమునను ఉత్తరమునను స్థితిగతులు క్రొత్త రషియనుసేనలరాకవల్ల బాగుపడినవని రాయిటరు ప్రత్యేకవిలేఖరి ఘంటాపథంగా చెప్పుచున్నాడు. రషియనులు జర్మనుసేనల పార్శ్వభాగములపై దెబ్బతీసి వారిపురోగమనమును ఆపివేసిరి. ఇచట రషియనుల స్వరక్షణప్రయత్నములో లేరు. శత్రుసేనపై విజృంభించి నురుమాడుచున్నారు. జర్మనులే రషియనుల దాడులను కాచుకొనుచు స్వరక్షణ ప్రయత్నములో నున్నారు. ఇంతకును కారణము క్రొత్తి రషియను సేనలరాక.

జర్మనుల ఆశ్చర్యము

ఈక్రొత్తసేన లెచ్చటినుండి వచ్చినదియు జర్మనులకు తెలియక విస్మయము కలిగెను.

స్టాలిన్గ్రాడు నగరమున కుత్తరమున జర్మను టాంకుల పంక్తుల మధ్యనుండి రషియను లింకను పూర్తిగా దూరిపోక పోయినను వారిజే పైచేయిగా నున్నది.

స్టాలిన్గ్రాడుకు దక్షిణమున శత్రుదాడులకు రషియనుల తిరుగుదాడులు బదులు పలుకుచున్నవి.

జర్మను విమానాశ్రయ విధ్వంసము

ఏ విమానాశ్రయములో నెలకొని జర్మను విమానములు స్టాలిన్గ్రాడుపై దాడులు సలుపుచున్నవో ఆ విమానాశ్రయమును రషియను విమానములు రూపులేకుండ నాశనము చేయగలిగినవి.

స్టాలిన్గ్రాడు రంగంలో పరిస్థితులలో మార్పేమియులేదు- అని జర్మను ప్రకటనలలో నుండుటనుబట్టి రషియనులే వృద్ధిలో నున్నారని అర్థము చేసికొనవచ్చును. ఎందుకనగా, ఏ కొంచెము తాము చేయగలిగినను జర్మనులు గొరంతలు కొండంతలుగా చేసి తమ గొప్పను చాటుకొనుట మామూలు. స్టాలిన్గ్రాడు నగరరక్షణ కింతకాస్మికముగా క్రొత్త రషియను సేనలు ఎచ్చటనుండి వచ్చినవో తెలియుటలేదనియు, ఈ సేనలు మాస్కో యుద్ధరంగమునుండి కొనివచ్చినవి గావనియు, ఇవి యుద్ధముచేసి అలసినచాయ కనబడుట లేదనియు జర్మను పత్రికయగు నేమనలో జీటంగు అబ్బురపడుచున్నది.

కాకససురంగం

మాస్కో, సెప్టెంబరు 10:—

కాకససు పడమటిభాగంలో నవరాసిస్కు పట్టణములో సగమువంతు జర్మనుల స్వాధీనములోనున్నట్లును సగమింకను రషియనులపట్టులో నున్నట్లును రాయిటరు ప్రత్యేక విలేఖరి వ్రాయుచున్నాడు. పట్టణవాయవ్యభాగములో చొచ్చుకొనివచ్చిన శత్రువును తిరుగుదాడులవల్ల రషియనులు నిలువరించుచున్నట్లు రషియను ప్రకటన యెరిగించుచున్నది. రషియను నౌకాదళసైనికులు ఒకచోటనుండి జర్మనులను పారద్రోలిరి. ఇచ్చటి యుద్ధము రిజెవు యుద్ధమును పోలియున్నది.

కాకససు తూర్పుభాగమున రషియనులు మజ్దాక్ ప్రదేశములో టెరెక్ నదిని దాటిన శత్రుసేనను భరతముపట్టించిరి. నదినిదాటి దక్షిణపుఒడ్డున స్థావర మేర్పరచుకొన్న శత్రువుపై నాలుగువైపులనుండి దాడులు కొనసాగెను. ఇంకను కొంత శత్రుసేన దక్షిణపు ఒడ్డున నున్నదికాని-అచ్చట ఎక్కువ దూరము విస్తరింపగలుగుటలేదు. కొంత జర్మనుసేన నదియొక్క ఉత్తరపు ఒడ్డుమీదుగా తూర్పుగా ముందుకు పోజూచుచున్నది. దక్షిణపు ఒడ్డున నున్న శత్రుసేనను వెనలగొట్టుటకై రషియను సేన ఒక క్రొత్తతంత్రము పన్నెను. చుట్టుప్రక్కల నున్న అడవులను తగులబెట్టెను. ఆ భాగముక్కులలోనుండి జర్మనులు ఉక్కిరిబిక్కిరి యగుచున్నారు.

ముఖర్జీ - రాజప్రతినిధి సంభాషణలు

ప్రయోజనము శూన్యము

ఢిల్లీలో నాయకుల సంప్రదింపులు

(స్వకీయవిలేఖరి)

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:—

శ్రీ శ్యామప్రసాద్ ముఖర్జీగారి మకాములోనివారి ఉత్సాహము తగ్గిపోయినది. రాజప్రతినిధితో తాను మాట్లాడిన విషయములను హిందూ సభా నాయకుడు తనసహచరులకు తెలియజేసెను. ఈ సంభాషణలవలన స్థితిగతులు మారలేదు. రాజప్రతినిధి ముభావముగా నున్నాడని హిందూసభానాయకులనుచున్నారు. ప్రభుత్వమువారి ప్రస్తుతనిబంధనలు తొలగింపుమాత్రము రాజీకుదుర్చుటకు ప్రయత్నములు కొనసాగింపవలెనని శ్రీ ముఖర్జీగారు తలచుచున్నట్లున్నది.

గాంధితో సంభాషణ లిప్పుడు జరుగవు

చెఱశాలకువెళ్లి గాంధి మహాత్మునితో మాట్లాడెదరా? యని ప్రశ్నింపగా చేతిలో నేదైన పరిష్కార మార్గమున్నగాని నేను మహాత్ముని చూడజాలను' అని ముఖర్జీ గారనిరి. కనుక ప్రభుత్వమువారు తమ సూచనల నంగీకరించునది, లేనిది చూచిగాని ముఖర్జీగారు మహాత్మునితోను, ఇతర కాంగ్రెసునాయకులతోను మాట్లాడరు.

ముఖర్జీగారి యిబ్బందులు

బ్రిటిష్ ప్రభుత్వమువారే యిప్పుడు ముందడుగువేయవలెనని మొదటినుండియు ముఖర్జీగారు చెప్పుచుండిరి. ప్రస్తుతము ఆయన చేయుచున్న ప్రయత్నములకు మూడు ప్రతిబంధకములు కలవు. హిందూసభవారి లేఖకు జిన్నాగారు ప్రత్యుత్తర మొసంగలేదు. ఢిల్లీ వచ్చిన పంజాబు మహమ్మదీయ మంత్రులు రాయబారములు సరళముగా జరుగుటకు తోడ్పడగలరా యను విషయమింకను స్పష్టముకాలేదు. అన్ని పార్టీలవారికి ఒడంబడిక కలిగించుట కిప్పుడేర్పడిన అవకాశమును జారవిడుచుట ముస్లిములలో బలీయమగు వర్గమువారికి యిష్టములేదు. కాని వారు జిన్నాగారి రాకకెదురుచూచుచున్నారు. రెండవది, శ్రీ రాజగోపాలాచారిగారు ఢిల్లీ వచ్చుట కింకను అంగీకరింపనందుకు వారు నిరుత్సాహముజెందియున్నారు. ఆయనను రప్పించుటకు యిప్పటికిని ప్రయత్నములు జరుగుచున్నవి. ప్రస్తుతస్థితిగతులను విచారించుటకు రాజప్రతినిధి శ్రీ రాజగోపాలాచారిగారిని, ఇతరనాయకులను ఆహ్వానించు సూచనలేమియులేవు. కాని భారత శాసనసభయందలి పార్టీనాయకులతో రాజప్రతినిధి రాబోవు వారమున మాట్లాడునని యూహించుచున్నారు. మూడవది రాజప్రతినిధి కార్యవర్గమునందలి భారతసభ్యులు భిన్నాభిప్రాయులై యున్నారు. ముఖర్జీగారికిని రాజప్రతినిధికిని మరియొక సమావేశము జరుగుటకెట్టి ఒడంబడికయు జరుగలేదు.

నాయకులలో యిష్టాగోష్ఠి సంభాషణలు నేడుగూడ సాగుచున్నవి. సర్. జగదీశ్ ప్రసాదుగారు ఢిల్లీవదలివెళ్ళిరి. కాని ఆయన త్వరలో తిరిగివచ్చును.

ఢిల్లీలో నాయకుల సంప్రదింపులు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:—

నేడు ఉదయము మరల నాయకులు సమావేశమై సమాలోచనలు సాగించిరి భారతదేశమువిషయమై ప్రధాని చర్చిలు ప్రకటన చేయునను వార్త నాయకులకు ఉత్సాహముకలిగించెను. చర్చిలు ప్రకటనకై అందరు శ్రద్ధతో వేచియున్నారు. చర్చిలుగారి ప్రకటన స్థితిగతులను మార్చివేయునని తలపబడుచున్నది, చర్చిలు ప్రకటనపై దృష్టినిలిపి, తాము ప్రస్తుతము పూనుకొన్న పనిని మానుకొనరాదనియు, చర్చిలు ఏమి చెప్పినను ప్రధానసూత్రముల పై ఒడంబడికకు దుర్చుకొను పనికొనసాగింపవలెననియు తలపబడుచున్నది.

నేటి సంభాషణలలో సర్ సికందరహయత్ ఖాను, ఖాన్ బహద్దూర్ అల్లాబక్షు, సర్ చోటూరామ్, రాజా మహేశ్వరదయాళ్ సేట్, మాస్టర్ తారాసింగు, సర్దార్ బలదేవ్ సింగు, ఎన్. సి. ఘటర్జీ, మెహర్ చంద్ ఖాన్, డా॥ శ్యామప్రసాద్ ముఖర్జీ, సర్ రాధాకృష్ణన్, డక్కా నవాబుగారలు పాల్గొనిరి.

రాజా మహేశ్వర దయాళుగారు హిందూమహాసభాధ్యక్షులగు శ్రీ సావర్కారుగారితో టెలిఫోనులో మాటలాడిరి. టెలిఫోనెట్లుండో డా॥ మూంజీగారు ఢిల్లీ వత్తురని తెలియుచున్నది. (అ. ప్రె.)

దక్షిణతీరమున రషియనుబల విధ్వంసమునకై జర్మనులు కొన్ని క్రొత్తసేనలను అచ్చటికి చేర్చునిమిత్తం నదిదాటవలెనను పరచిరి. కాని వాటిని రషియను విమానములు ధ్వంసముచేసెను.

మాస్కోరంగంలో మూడుస్థలములు రషియనుల వశమైనవి. 400 మంది జర్మనులు మరణించిరి.

రైలు రవాణా

సర్ ఎడ్వర్డు బెంథాలు సూచనలు

ట్రాన్సుపోర్టు అడ్వైజరీబోర్డు సమావేశం

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:—

నేడు ట్రాన్సుపోర్టు అడ్వయిజరీ సంఘము నెదుట నుపన్యసించుచు ట్రాన్సుపోర్టు శాఖ సభ్యుడగు సర్ ఎడ్వర్డు బెంథాల భారతరైల్వేల స్థితిగతులను గూర్చి క్రింది విధముగా నెన్నెను:—

రైల్వేలను సమర్థతతో నడుపుటవల్ల వానివలన కలుగు ప్రయోజనము 100 కి 25 వంతులు పెరిగినది. రైల్వేలను నడుపుటయందు అమెరికావా రవలంబించుచున్న ఉత్తమపద్ధతులతో మన పద్ధతులు సమానముగా నున్నవి. పూర్వముకంటె 1941-42 సం॥లో రైల్వేలు 2 కోట్ల మంది ప్రయాణికులను తీసుకొనిపోయెను. యుద్ధమునకు పూర్వము సగటున తీసికొనిపోవు జనముకంటె 9 నుండి 10 కోట్లను హెచ్చుగా చేరవేసెను.

సరుకుల బట్వాడా

దేశములో ఉత్పత్తి హెచ్చుకొలదియు సరుకులను బట్వాడాచేయు పని సుకరమగుటకు బదులు యెక్కువ కష్టమగునని నేను చెప్పవలసి యున్నది. ఈ సమస్య చాల కష్టమైనది. ఈ సమస్యను పరిష్కరించుటకు యింకా ప్రయత్నములు జరుగవలసియున్నది. ఈ విషయము సందర్గ్రహించుచునే యున్నారు. మందుండు సామగ్రిఉత్పత్తి యిప్పుడెంతప్రధానముగా నెంచబడుచున్నదో, అంతప్రాముఖ్యమునే సరుకులబట్వాడాకు తోడ్పడు సామగ్రి కొనసంగవలసినస్థితి యిప్పుడు వచ్చినది.

క్రొత్త ఇంజనులు కావలెను

భారతదేశముయొక్క ఉత్పత్తి విశేషముగా హెచ్చవలసినచో భారతదేశమునకు యెక్కువ ఇంజను లవసరమని ఇంజనులు తయారుచేయ మిత్రమండలి దేశములవారికి మేము తెలిపితిమి. భారతదేశములోనే ఇంజనులు తయారుచేయుటకు మేము ప్లానులుతయారుచేయుచున్నాము. కాని కొంతకాలము వరకు ఈప్లానులవలన యెక్కువ ప్రయోజనముండదు. ఇంజనులను త్వరత్వరగా మరమ్మతుచేయుటకు రైల్వే అధికారులు ప్రత్యేకముగా శ్రద్ధ వహించుచున్నారు. మరమ్మత్తులోనున్న యింజనుల సంఖ్య తగ్గించుచో క్రొత్తవానిని కొన్నంతస్థలము కలుగును. ఇంజనులను త్వరత్వరగా మరమ్మతు చేయవలసినచో యిప్పుడు మందుండు తయారుచేయుచున్న ఫ్యాక్టరీలలో కొద్ది భాగమును రైల్వేవారు మరల తమ క్రిందికితీసుకొనవలసి వచ్చును. ఇతరచోట్ల మందుండు విస్తారంగా తయారగుచున్నది. గనుక యిది కీలుకావచ్చును.

వాగనులలో బరువులనెత్తుట

ఇప్పుడు వాగనులలో భర్తీగా సరుకు నింపబడుచున్నది. వాగనులను ఊరకుండనిచ్చుటలేదు. కాని దేశములోని సరుకులన్నిటిని మనము చేరవేయవలసినచో యింతటితో మనము సంతృప్తి జెందియుండరాదు. వాగనులలో యింక సరుకునింపుటకును, వాగనులచేత యింక పనిచేయించుటకును మనము పూనుకొనవలెను. దగ్గర మార్గములలో ముడిపదార్థములను, తయారైన వస్తువులను చేర్చుచున్నారని నిశ్చయము చేసుకొనుటకై పరిశ్రమలవారిగా నిప్పుడు కార్యక్రమములు సిద్ధము చేయబడుచున్నవి. పరిశ్రమలవారి తోడ్పాటువల్లగాని ఈ పని బాగుగా నెరవేరదు. గొప్ప పారిశ్రామికులు లనేకులు యిందువిషయమై చేసిన సహాయమునకు కృతజ్ఞుడను. రవాణాలో మనకు గలయిబ్బందులను గ్రహించి, వానిని తొలగించుటకు పైనికాధికారులు చేసిన సహాయమునకు గూడ కృతజ్ఞుడను.

సారిశ్రామికులు, పైనికాధికారులు మనకు చేయదగినసహాయ మెంతయో కలదు.

ముఖ్యవస్తువులు:: ఆనవసరవస్తువులు

ముఖ్యముకాని వస్తువులను రయిల్వేలలో చేరనీయకుండుటయనుసమస్యను మేము మాత్రమే గాక విచారించుచున్నాము. కాని భారతదేశములో నోటిలాసవస్తువులని చెప్పదగిన వస్తువుల పట్టకము మహాకాండ్రి. యుద్ధప్రయత్నమునకు అవసరముకాని ప్రతివస్తువును మనము నిరాకరించితిమా, దేశములో నిరుద్యోగసమస్య తలెత్తుదును. అత్యవసరమైనగాని యిట్టి నిర్ణయ నేను కైకొనను. ప్రస్తుతము ముఖ్యమైన వస్తువులను మొదటచేరవేయుచు, అంత ముఖ్యముకానివస్తువులను అవకాశము నుపసరించి తరువాత చేరవేయు పద్ధతి ఉత్తమము.

రాజకీయసంక్షోభము

రాజకీయ సంబంధమగు గడబిడల వల్ల రైల్వేలకు కలిగిన నష్టమెంతో యిప్పుడే చెప్పజీలులేదు. కాని ఒత్తిడి యెంతయెక్కువగానున్నను రైల్వేపనివారు, తమకు రగిలినంత రక్షణయున్న ప్రదేశములలో తమ పనిపాటలను అత్యంతవిశ్వాసముతో నెరవేర్చిరి. రైల్వేఆస్తికి కలిగిన నష్టము వల్ల రైల్వేపనివారి కష్టము హెచ్చుచున్నది. ఇట్టిపనులు భారతదేశాభివృద్ధికి సాధనములెన్నటికిని కావు. రైల్వేపనివారి స్వామిభక్తి పనివారి నాయకులు పనివారికిచ్చిన మంచిసలహా అత్యంతము ప్రశంసనీయములై యున్నవి. రైల్వేఆస్తికి కలిగిన నష్టమును పూడ్చుటకు పనివారు చాల తోడ్పడిరి. వీరి సహాయముతో, ముందెన్నికష్టము లున్నను మనము యుద్ధనిర్వహణమున కవసరమగు పనులను, ప్రజలజీవిక కవసరమగు పనులను బాగుగా నిర్వర్తింపగలమని నమ్ముచున్నాను.

అమ్మకము

ప్రశస్తమైన బత్తాయి నారింజ (సాత్కూడి) మొగ్గవేసిన నారెంజ మొక్కలు, రెండు సంవత్సరముల నాటివి 100 రు. 50/-లు. 25 కు లోపు, చిల్లర అమ్మకము, మొక్క 1-కి 0-10-0 ప్యాకింగు, రైలుచార్జీలు అదనము. ఆర్డరుతో, ముందుగా 25% చెల్లింపవలెను. యస్. సాంబసివన్, శెట్టిగుంట, యం. యస్. యం. Via కోడూరు (కడప) P. O.

ప్రకటన

ఓ. శి. రామస్వామిశెట్టి & కంపెనీ, జవుళి దళాల్, గృహ, శేలం అనే పేరుతో భాగస్వాములుగ నుండి వ్యాపారము చేయుచుండిన యీ దినమను సంతకములు చేసినట్టి మేము మా యిష్టపూర్వకముగ సదరు వ్యాపారమును కట్టివేసి సదరు కంపెనీని 5-9-42 నుండి రద్దుపరుచుకున్నాము. కాబట్టి యిందు మూలకముగ ఎల్లరకు తెలుపుకొనుచున్నాము.
1. ఓ. శి. రామస్వామిశెట్టి,
2. యం. యస్. వసంతశెట్టి,
3. పి. వి. గోవింద రాజుశెట్టి,
4. పి. ఆర్. కే. అర్ధనారిస్వామిశెట్టి,
గృహ శేలం, 5-9-42.

టెండరు నోటీసు

గ్రెయిన్ పర్చేజింగుఆఫీసు, బెజవాడ.

ఉప్పుడుబియ్యముగాని, పచ్చిబియ్యముగాని సప్లయి చేయుటకుగాను సప్లయిదారు పంపుకునే టెండర్లు బెజవాడ గ్రెయిన్ పర్చేజింగు ఆఫీసరువారిచే 13-9-42 తేదీ సాయంకాలము 5 గంటలలోగా తీసుకొనబడును.

సదరు టెండరులో యీదిగువ నమోదు చేసినవిషయములు పూర్తిగా వ్రాయవలెను.
1. సప్లయిచేయబడు బియ్యముయొక్క వాడుకభాషలోని పేరు.
2. టెండరు అంగీకరించిన తక్షణమే సప్లయిదారు ఎన్నిటన్నులబియ్యము సప్లయి చేయగలిగినది.
3. సప్లయిచేయదలచినబియ్యము మణుగు 1-కి ఖరీదు (F. O. R. delivery).
4. సప్లయిదారు చేర్చదలచిన రైల్వే స్టేషను పేరు.
5. బియ్యముయొక్క మచ్చు పంపవలెను.

ఇతరవిషయములు బెజవాడ గ్రెయిన్ పర్చేజింగు ఆఫీసులో కనుగొనవచ్చును.

(సం.) బి. మాధవరావు,
గ్రెయిన్ పర్చేజింగు ఆఫీసరు.

ప్రశస్తమైన వైద్యవిద్య
ఆయుర్వేదోషధములు
ఎచ్చట లభించును?
ఆర్యరసాయనశాల, ముక్త్యాల

శ్రీ ఏ. యస్. కె. అయ్యంగారు అరెస్టు

కాంగ్రెసు ఉద్బోధవాక్యాలు పలికినందుకు 4 గురికి 9 మాసాలశిక్షలు

రైలు గొలుసు లాగినందుకు కాలేజి విద్యార్థికి జరిమానా

మదరాసు, సెప్టెంబరు 10:—

ఇటీవల నిర్బంధంనుండి విడుదలైన శ్రీ ఏ. యస్. కే. అయ్యంగారు మొన్నరాత్రి మళ్లీ దేశరక్షణ నిబంధనల క్రింద అరెస్టు చేయబడిరి. ఆతడు గత ఆగస్టు 23, 25 తేదీలందు చాకలపేటలో జరిగిన బహిరంగసభలందు ఆక్షేపణీయమైన ప్రసంగాలు ఒసగెనను నేరమునకై నిన్న చెన్నరాజధాని ప్రధాన మేజిస్ట్రేటు శ్రీ జి. వెంకటేశ్వరన్ గారి ఎదుట పోలీసులచే హాజరుచేయబడెను. కాంగ్రెసు నాయకులపట్ల ప్రభుత్వం తీసుకొన్న చర్యలను ఖండించి ప్రభుత్వంపట్ల ద్వేషము పురికొల్పేలాగునను, యుద్ధనిర్వహణకు నిరోధమును కలిగించేలాగునను ఉపన్యాసా లొసగినరని ఆరోపణ గావింపబడెను. మేజిస్ట్రేటు కేసునుబాఖలుచేసికొని ముద్దాయిని రిమాండులో నుంచిరి. కేసు విచారణ సెప్టెంబరు 12 వ తేదీకి వాయిదా వేయబడెను.

కాంగ్రెసు ఉద్బోధ వాక్యాలు పలికినందుకు శిక్షలు

సెప్టెంబరు 6 వ తేదిని జాతీయప్రార్థన దినమున విక్టోరియా పబ్లికుహాలులో మదరాసు గవర్నరుగారు ఉపన్యసించినపుడు కాంగ్రెసు ఉద్బోధవాక్యాలను అరచి అక్రమచర్యలు గావించినందుకు దేశరక్షణ నిబంధనల క్రింద అరెస్టు చేయబడిన శ్రీయుతులు యం. కే. రామకృష్ణ, రఘునాథరావు, మణ్మగం, సుబ్రహ్మణ్యంగార్లపై కేసులను నిన్న చెన్నరాజధాని మేజిస్ట్రేటు విచారణచేసి ముద్దాయిలకు రెండు 9 మాసాల కఠినశిక్షలు విధించెను.

ముద్దాయిలు ఆరోజున కాంగ్రెసు ఉద్బోధవాక్యాలు పలికిరనియు, వారు తమిళమున, ఆంగ్లమున ఆక్షేపణీయమైన కరపత్రాలు ఉంచుకొని యుండిరనియు, ఆనేరమునకై వారిని అరెస్టుచేసినట్లును పోలీసు ఇన్స్పెక్టరు మహ్మద్ జాన్‌గారు సాక్ష్యంలో చెప్పిరి.

తాటెట్టి నేరము చేయలేదనిన్నీ, సభకు హాజరగుటకు వి. పి. హాలుకు వెళ్లినట్లును సుబ్రహ్మణ్యం అను ముద్దాయి తెలిపెను. తతిమ ఘన్గురు ముద్దాయిలు తాటెట్టి అక్రమచర్యలు చేయలేదని తెలిపిరి.

శ్రీ రామకృష్ణన్ తనపక్షమునను, యితర ముద్దాయిల తరఫునను మాట్లాడుతూ యీకేసులు ఏ సమయమున గావింపబడెనను విషయమే ప్రధానమైనది గనుక హాలులో అపుడు వేదికమీదనుండిన కొందరు ప్రముఖులను తమ సాక్ష్యముగా మనుచేయ అభిప్రాయమున్నదనియు, తానొక్కడే హాలులో ప్రవేశించి ప్రార్థనలవల్ల మాత్రమే ఏమీ ప్రయోజనంలేదనిన్నీ కాంగ్రెసు నాయకులను విడుదలచేసి రాజీకి వచ్చుటే మంచి మార్గమని అరచి, తరువాత ఇండియాను వదలిపొమ్మని అరచినట్లును చెప్పెను. రెండు మూడు ముద్దాయిలు హాలులో ప్రవేశించక వరాండాలో నిలిచి యుండిరనియు, నాల్గవ ముద్దాయి ఎవరో తమకు తెలియదనియు అతడు చెప్పెను.

కేకలు వేసేసమయమున గావించబడెనను విషయము అంత ప్రధానమైన విషయము కాదనియు, నేరంచేసినజే ప్రధానమనియు, తమసాక్షులను తెచ్చుకొనే అభిప్రాయము ముద్దాయిల కున్నదాయని మేజిస్ట్రేటు అడిగెను. సాక్షులు అవసరంలేదని ముద్దాయిలు తరువాత తెలిపిరి. అంతట మేజిస్ట్రేటు ముద్దాయిలను నేరస్థులుగా పరిగణించి చెరో 9 మాసాల కఠినశిక్ష విధించెను.

రైలుగొలుసును లాగిన నేరము

పచ్చయప్పకాలేజి 1 వ తరగతి విద్యార్థి శ్రీ ఆర్. రంగరాజన్ (17సం॥లు) అను నతడు ఎగ్మూరు హార్బర్ స్టేషనుల మధ్య విద్యుచ్ఛక్తి రైలుగొలుసును లాగెనను నేరమునకై మొన్న సాయంత్రం అరెస్టు చేయబడెను. ఆతనికేసు యీవారాన రాజధాని ప్రధానమేజిస్ట్రేటు ఎదుట విచారణకు వచ్చెను.

ముద్దాయి తన నేరమును ఒప్పుకొనుచూ యితరుల ప్రోద్బలంవల్ల తాను గొలుసు లాగినట్లును, తన చర్యకు పగచుచున్నట్లును యికమీద అట్టిచర్యలు చేయనట్లు కోర్టు వారికి దీనిని పెను. ముద్దాయి సత్ప్రవర్తన కలిగియుండిన విద్యార్థియే యనియు, సమ్మెలోగాని, అల్లరులలోగాని యింతవరకు పాల్గొనియుండలేదనియు, ముద్దాయి పేదవిద్యార్థి యనియు యికమీదట ఆవిద్యార్థి సత్ప్రవర్తన కలిగియుండగలరను పూచీ తానిస్త సిద్ధమనియు కోర్టులో పచ్చయప్ప కాలేజి ప్రిన్సిపాలు డా॥ బి. వి. నారాయణస్వామి నాయుడుగారు చెప్పిరి

గుంటూరులో నిషేధపుటుత్తరువు

హిందూ కళాశాలలో గుర్తింపు పోరేడు

ఉత్తర ప్రత్యుత్తరములు

(మా విలేఖరుల వద్దనుండి)

గుంటూరు, సెప్టెంబరు 8:—

శ్రీయుత శ్రీరామమూర్తి (కమ్యూనిస్టు) నిన్న హిందూదేశరక్షణచట్టముక్రింద అరెస్టు చేయబడి, ఈ పట్టణపు సబుజైలులో నుంచబడ్డారు.

శ్రీ యుత పి. యే. అచ్యుత మీనన్ ఐ. సి. యస్. జిల్లామేజిస్ట్రేటు గుంటూరు నిన్న ఇండియా దేశపు రక్షణచట్టము సెక్షను 56(1) క్రింద ఉత్తరువు జారీచేయుచు, కాంగ్రెసుసభలుకాని, దానికి చెందిన యేసభకాని లేక ప్రస్తుత కాంగ్రెసు ఉద్యమమునకు సంబంధించిన సభకాని జరుపుటను నిషేధించిరి.

గుంటూరు సర్కిలు ఇనస్పెక్టరుగారు హిందూ కళాశాల ప్రిన్సిపాలుగారికి ఉత్తరము వ్రాయుచు, 18 వ ఆగస్టు పోలీసువారు గాంధిపార్కులో కాల్చినప్పుడు ఆ సమయములో నున్న కొందరు విద్యార్థులను గుర్తించుటకై హిందూకళాశాల, స్కూలులో, పోలీసువారి ప్యారేడు చేయుటకును, ఆ విద్యార్థులను గుర్తించుటకై తమకు అనుమతి నివ్వవలెనని కోరిరి.

ప్రిన్సిపాలుగారు ఈ విషయమును గూర్చి కళాశాల స్కూలు (మ్యానేజుమెంటు) పాలకవర్గమునకు వ్రాయవలెనని జవాబు నొసంగిరి.

ఆ విధముగా సర్కిల్ ఇనుసుపెక్టరు వ్రాయగా, ఈ దినము హిందూకళాశాల స్కూలు, పాలకవర్గము సమావేశమై స్కూలును, కళాశాలను, ఈ దినము రేపు (8, 9) మూయుచు పోలీసువారి ప్యారేడు ఆపవలెననియు, జిల్లా మేజిస్ట్రేటువారిని కోరుచు, ఉత్తరము వ్రాసినారు. వారి జవాబుకై కమిటీవారు నిరీక్షించుచున్నారు.

కడప న్యాయవాదుల తీర్మానము

సెప్టెంబరు 8:— ఈపట్టణమునందున్న పెక్కుమంది న్యాయవాదులు శ్రీగాంధిజీని, ఇతర జాతీయనాయకులను, ప్రభుత్వమువారు నిర్బంధించినందులకు ప్రతికూలతను తెలుపుచు వెంటనే జాతీయనాయకుల కోరికను సఫలముచేసి, నాయకులను విడుదల చేయవలెనని చెన్నరాష్ట్రప్రభుత్వ ప్రధానకార్యదర్శికి, కడప జిల్లా మేజిస్ట్రేటుగారి ద్వారా ఈదినము సంతకముచేసి ఒకఉత్తరమును పంపిరి.

పులివెందుల

సెప్టెంబర్ 8:—పులివెందుల తాలూకా క్రొత్త గంగిరెడ్డిపల్లె గ్రామములో నుండు మదనపల్లె కళాశాల విద్యార్థి శ్రీ గంగిరెడ్డి అనునతనిని ఈనెల 4 తేది పులివెందల సర్కిలు ఇన్‌స్పెక్టరుగారు దేశరక్షణ చట్టముక్రింద అరెస్టు చేసి పులివెందల సబ్ జైలులో రిమాండునందుంచి యున్నారు.

మానికొండ సత్యనారాయణ శాస్త్రిగారికి శిక్ష

గుడివాడ, సెప్టెంబరు 9:—

తమ స్వగ్రామము ఉరుటూరునుండి వెలికి రాకూడదను మొదలగు నిర్బంధములలో నుంచబడిన శ్రీ మానికొండ సత్యనారాయణ శాస్త్రిగారు, వారిపై విధింపబడిన నియమముల నుల్లంఘించిరను కారణమున ఇండియా రక్షణచట్టము ననుసరించి పామర్రులో అరెస్టుచేయబడి నిన్నటిదినము గుడివాడ సబుడివిజనల్ మేజిస్ట్రేటు గారిచే విచారింపబడిరి. వీరికి ఒక సంవత్సరము శిక్షయు, నూరురూపాయలు జరిమానాయు విధింపబడెను. జరిమానా చెల్లింపనిచో మరి నాల్గుమాసములు శిక్ష. వీరిని "ఏ"క్లాసులో నుంచుటకు సిఫార్సు చేయబడెను. వీరు బెజ్జాలిక్యాంపులైలుకు గొంపోబడుదురు.

మోపర్రు వాస్తవ్యులును, కమ్యూనిస్టు పార్టీకి చెందినవారునను శ్రీయర్రప్రతి వెంకట్రావుగారు గుడివాడ పోలీసువారిచే అరెస్టు చేయబడి స్థానిక సబుజైలునం దుంచబడియున్నారు.

నరసాపురం

సెప్టెంబరు 8:—నిన్న కోర్టువద్ద పికెటింగు చేయుచుండగా నరసాపురం పట్టణ కాంగ్రెసు అగ్రగణ్యులైన శ్రీయుత సింగంశెట్టి సుబ్బారావుగారినిన్నీ కార్యదర్శి యగు శ్రీయుత భాస్కర్ల ఈశ్వరుడుగారి నిన్నీ మామిళ్లపల్లి సోమయాజులుగారినిన్నీ పోలీసువారు అరెస్టుచేసి తీసుకొనివెళ్లిరి.

పాలకొల్లు

సెప్టెంబరు 8:—పాలకొల్లు రైల్వేస్టేషను తనులబడిన సందర్భంలో పాలకొల్లులో డబ్బాబ్రాంఛీ ఆస్తుకొని జీవనముచేయుచున్న

ముద్దాయి నిందితుడని మేజిస్ట్రేటు పరిగణించి తప్పుచేసినందుకు ముద్దాయి పశ్చాత్తాపము తెలిపిన కారణమున ఎక్కువశిక్ష విధించక రూ 20 జరిమానా ప్రత్యామ్నాయంగా ఒకనెల కఠినశిక్ష విధించిరి.

బెంగ్లూరు సంపాదకుల అరెస్టు

దేశరక్షణచట్టంక్రింద చర్య

బెంగ్లూరు, సెప్టెంబరు 9:—

"డెయిలీ న్యూస్" పత్రికా సంపాదకుడు శ్రీ ఏ. ఆర్. రామయ్య, "తాయినాడు" సంపాదకుడు శ్రీ సి. బి. శ్రీనివాసన్ "విశ్వకర్నాటక" సంపాదకుడు శ్రీ యస్ కృష్ణశర్మ "జనవాణి" సంపాదకుడు శ్రీ గుప్తాగార్లు రాత్రి రెండుగంటలపుడు అరెస్టుచేయబడిరి. డెయిలీన్యూస్ పత్రిక ఆంగ్లమున, తతిమపత్రికలు కన్నడమున బెంగుళూరులో ప్రచురింపబడు పత్రికలైయున్నవి.

పైవారుగాక ఇటీవలవరకు విశ్వకర్నాటక పత్రికా సంపాదకుడుగా నుండిన శ్రీ టి. టి. శర్మగారు కూడా అరెస్టు చేయబడిరి.

అయిదుమంది సంపాదకులను పోలీసులు నగరమేజిస్ట్రేటు ఎదుట హాజరుచేసి కేసులు పెట్టిరి.

ముద్దాయిలను బెయిలుమీద వదలవలెనని దరఖాస్తు పెట్టబడెను. ప్రాసిక్యూటింగు ఇన్‌స్పెక్టరు ఆ దరఖాస్తును ప్రతిఘటించి మరుసటిరోజువరకు వ్యవధికోరెను. మేజిస్ట్రేటు కేసును రేపటికి వాయిదా వేసెను.

ముద్దాయి లందరిని సెంట్రలు జైలులో రిమాండులో నుంచిరి. (అ. ప్రె.)

పోస్టలు ఆర్. ఎం. ఎస్. సంఘ అధ్యక్షులను ఎస్. గురుస్వామిగారు మరికొందరు మదరాసులో 7 వ తేదీ ఉదయం ఇండియా ప్రభుత్వ సభ్యులగు సర్ మహమ్మదు ఉస్మానుగారివద్దకు రాయబారంవెళ్లి, కరవు అలవెన్సు పోస్టలు టెలిగ్రాఫ్ ఉద్యోగులకు యిమ్మని కోరిరి. అక్టోబరులో ఆలోచింతుమని వారు బదులు చెప్పిరి.

పొప్పత్తి వెంకట్రాజును అనుమానించి అరెస్టుచేసి నర్సాపురం తీసుకువెళ్లిరి పాలకొల్లు మున్సిపల్ హైస్కూలు సమ్మె సందర్భంలో యింకను పికెటింగు జరుగుచున్నది. హెచ్చుమంది విద్యార్థులు బడికిపోవుచున్నారు.

చీరాలలో అరెస్టు

చీరాల, సెప్టెంబరు 8:—

ఎ. సింహాచలం అను వానిని ఈ వూరి పోలీసు సబ్ ఇన్‌స్పెక్టరుగారు 7 వ తేదిని డిఫెన్సుచట్టముక్రింద అరెస్టుచేసి ఒంగోలు సబ్ జైలుకు తీసుకొని వెళ్లినారు.

నెల్లూరు జిల్లాబోర్డు

నెల్లూరు, సెప్టెంబరు 9:—

నేడు ఉదయము 9 గంటలకు నెల్లూరు జిల్లాబోర్డు అధ్యక్షుడు శ్రీ వంగల్లు కోదండరామిరెడ్డిగారివద్ద నుండి జిల్లాకలెక్టరు డేరోరగారు చార్జి తీసుకొనిరి. (స్వ. వి.)

నెల్లూరు

సెప్టెంబరు 9:—నేడు భారతనాయకులను అరెస్టు చేసిన దినమగుటచే తతనెల్లూరులో కొన్నిదుకాణములు మూసినట్లు తెలియుచున్నది.

బారువ నాయకుల అరెస్టు

బారువ, సెప్టెంబరు 8:—

బారువ పంచాయితీబోర్డు అధ్యక్షుడును, జిల్లా కిసానునాయకుడునగు దుగ్గిరాల సాహంగారు బర్మా కాంగ్రెసుకుల సంఘాధ్యక్షుడు, బర్మా కార్మిక నాయకుడునగు ఎస్. వల్లభరావుగారు, రయితు నాయకుడగు శ్రీ కృష్ణ అప్పారావుగారు నిన్న సోంపేట పోలీసులచే అరెస్టు చేయబడిరి. (స్వ. వి. తంతి)

పెంటపాడు విద్యార్థులవైకేసు

తాడేపల్లిగూడెం, సెప్టెంబరు 8:—

పెంటపాడులో గత మాసంలో పోస్టాఫీసు, పి. డబ్ల్యు. డి. ఓవర్సీయరుల రికార్డుల తగులబెట్టిన అల్లర్ల సందర్భమున అరెస్టయిన వారిలో ఆరుగురు వి. ఆర్. రామారావుగారు నిన్న విడుదల కాబడిరి. వలివర్తి వెంకట సుబ్బరాజుగారి రిదివరలోనే విడుదల పొందిరి. నిన్న 13 స్థరపై సెక్షను 35 ఇండియా రక్షణచట్టంక్రింద పోలీసు సబిన్‌స్పెక్టరు ఎస్. వెంకన్ననాయుడుగారు విద్యార్థులను తాడేపల్లి ముసలయ్య, వరదా బ్రహ్మానందం, చిలుకూరి వీరభద్రయ్య, మెండు నరసింహారావు, కాళ్లకూరి వరప్రసాదరావు, కిలారి వెంకటరావు, వట్టి వెంకటరావుగార్ల మీద చార్జిషీటుదాఖలుచేయగా నిన్న కామవరపుకోట మక్కాల్లో నున్న కొవ్వూరు సబు డివిజనలు మేజిస్ట్రేటు కె. రాజరత్నం నాయుడుగారి కోర్టులో హాజరుపర్చబడుచు పోబడిరి. సెప్టెంబరు 15 తేదీకి విచారణ వాయిదాపడెను.

పెంటపాడు పంచాయతీబోర్డు మహాదేవ దేశాయిగారి మరణమునకు సానుభూతి తీర్మానం చేసెను. (స్వ. వి)

బొంబాయి అల్లరులు: కాల్పులు

150 మంది స్త్రీల అరెస్టు

బొంబాయి, సెప్టెంబరు 9:—

ఈవారాన మధ్యాహ్నం బొంబాయిలో పోలీసువారు నాలుగుసార్లు తుపాకులను కాల్చవలసివచ్చింది. గుళ్లవలన గాయపడిన వారిలో నలుగురిని యిప్పటివరకు హాస్పిటల్సులో చేర్చారు. ఈవారాన సాయంకాలం సభలను పూరేగింపులను జరుపుటకు ప్రజలు తరచుగా ప్రయత్నాలు చేశారు. చౌపత్తిలో మిక్కిలి హెచ్చుమంది ప్రజలుచేరారు. వారు సభను జరుపబోగా పోలీసువారు లాఠీఛార్జి చేసి తరిమేశారు. ప్రజలు పోలీసువారిమీద రాళ్లను విసిరారు. పోలీసువారు తుపాకులను కాల్చినారు. ప్రజలలో యిద్దరికి గాయాలు తగిలాయి. అక్కడనే కొంతమంది విద్యార్థినులు సభను జరుపుటకు ప్రయత్నించారు. వారి నాయకురాలిని పోలీసువారు అరెస్టుచేశారు మిగిలిన వారిని చెదరగొట్టారు.

చీకటిపడిన తర్వాత అదివరకు అల్లరులు జరుగనిస్థలములలో కూడా అల్లరులు ప్రారంభమైనాయి. చౌపత్తి నుంచి తరిమివేయబడినవారు గిర్గాంబాకురోడునుండా వెళ్లసాగారు. చౌపత్తిలో పోలీసువారు ప్రజలమీద తుపాకులను కాల్చారని వారు కేకలువేశారు. అందువల్ల గిర్గాంలో ప్రజలలో వుద్రేకం చాలా అధికమయింది. అక్కడ పెద్దగుంపు చేరింది. వారు టెలిఫోను స్తంభాలను పడగొట్టారు. రాళ్లు విసిరారు. పోలీసువారు చాలాసారులు లాఠీఛార్జి చేశారు. పేలుస్మోకుస్క్వాబ్బులను ప్రయోగించారు. ప్రజలఅల్లరులు తగ్గనందున పోలీసువారు మూడుసారులు ఆ రోడ్డుమీద తుపాకులను కాల్చారు. ప్రజలలో నలుగురికి గాయాలు తగిలాయి.

మొత్తము 120 మంది స్త్రీలను యిక్కడ అరెస్టుచేశారు. వీరిలో మిక్కిలి హెచ్చుమంది బాలికలే. వీరిలో 105 మంది ఛాకూద్వారా ప్రార్థన సమాజము వద్దను, లామింగుటను రోడ్డులోను ఊరేగింపులను జరుపుటకు ప్రయత్నించగా వీరినందరిని పోలీసువారు అరెస్టుచేశారు. వీరిని అరెస్టుచేసిన తరువాత అన్ని ప్రాంతాలలోను అల్లరులు మరింత అధికమయినాయి. ధాకూరుద్వారులో పోలీసువారు 5 బారులను (రౌండు) వదిలారు. ఎవరికీ గాయాలు తగలలేదని తెలిసింది. మరియొక ప్రాంతములో టేరుగాసును ప్రయోగించారు. కొన్ని ప్రాంతాలలో రాకపోకలు నిలిచిపోయాయి.

జయశ్రీ రాయజీ సతిగారున్ను, మరి నలుగురు స్త్రీలున్ను ఒక సందులోనుంచి కాంగ్రెసుజండాలను పట్టుకొని మాధవబాగు చవుకులోనికి వచ్చారు ప్రజలు గచ్చుకాలి బాటలమీద నిలువబడి చూస్తూవున్నారు. పోలీసుదళములు సిద్ధముగా వున్నాయి. ఒకకనిస్టేబిలు 5 మంది స్త్రీలను అరెస్టుచేసి అక్కడ సిద్ధంగావున్న వకలారీలో తీసుకొనివెళ్ళాడు. ఆ ప్రాంతములో దుకాణాలన్నీ మూసివేయబడెను.

నేడు మధ్యాహ్నం స్టాపు ఎక్సుఛేంజివద్ద వకడు కాంగ్రెసుస్లోగనులను అరుస్తూవుంటే వానిని అరెస్టుచేశారు. నేడు మధ్యాహ్నము 3½ మొదలు రాత్రి 7½ గంటలవరకు 4 గంటలసేపు అల్లరులు జరిగాయి. తరువాత శాంతి యేర్పడ్డది. జయశ్రీ రాయజీ సతిగారిని అరెస్టుచేసిన పిమ్మట డాక్టరు వి. ఆర్. పారిఖుక్యన, డా॥ ఎస్. జి. పాండ్యాకక్యగార్లున్ను మరి యిద్దరు స్త్రీలున్ను కాంగ్రెసు జండాలను పట్టుకొని విఠలభాయిరోడ్డుకు వచ్చారు. వీరిని కూడా అరెస్టుచేశారు. సి. పి. చెరువువద్దకు చేరిన గుంపులను పోలీసువారు పంపివేస్తూవుండగా కాంగ్రెసు జండాలను పట్టుకొని 50 మంది బాలికలు తెగలు తెగలుగా వచ్చారు. వీరి సందరిని ఒక్కసారే అరెస్టుచేశారు. మరికొందరు బాలికలు ఈలాగే తెగలు తెగలుగా రాగానే వారిసందరిని వెంటవెంటనే మహారుబవురీ పోలీసుస్టేషనుకు తీసుకొని వెళ్లారు. విఠలభాయి రోడ్డులో స్త్రీల పెద్ద వూరేగింపులోనుంచి విడిపోయి నలుగురు బాలికలు చౌపత్తి మైదానమునకు వచ్చారు. వీరినికూడా అరెస్టుచేశారు. అక్కడచేరిన గుంపునిమీద లాఠీఛార్జీ చేశారు. వారిలో కొందరు రాళ్లు విసిరారు. పోలీసువారిలో యిద్దరికి గాయాలు తగిలాయి. పోలీసువారు రెండుసారులు తుపాకిని కాల్చారు. ప్రజలలో యిద్దరికి గుండుదెబ్బలుతగిలాయి.

విఠలభాయి రోడ్డులో బస్సులు ట్రాములు నడుపకుండా ప్రజలు దారిదిగ్బంధంగా నిలబడ్డారు పోలీసువారు తరుచుగా లేరు గాసును ప్రయోగించారు.

పోలీసు కమిషనరు యీనెల 6 వ తేదినుంచి కరుగ్యా వుత్తరువును అమలులో పెట్టారు. నిర్బంధాజ్ఞ కారు, కాంత్రాకూలు పేటలలో పూరేగింపులను జరుపుటకు విద్యార్థులైన బాలికలు చాలసారులు ప్రయత్నించారు. ఒకస్త్రీని యిద్దరు పురుషులను పోలీసువారు అరెస్టుచేశారు.

356 మందిని అరెస్టుచేయుట

ఈవారాన మొత్తము 356 మందిని అరెస్టుచేశారు. వీరిలో 156 మంది స్త్రీలు. 200 మంది పురుషులు రాత్రి 7½ తరువాత అల్లరులు జరిగినట్లు తెలియలేదు.

ప్రభుత్వ ప్రకటన

ఈవారాన కాలేజీలకున్ను, పాఠశాలలకు నున్ను విద్యార్థులు నున్ను విద్యార్థినులున్ను మిక్కిలి కొద్దిమంది మాత్రమే వచ్చారు.

కోటప్రాంతములో ఎల్ఫిన్‌స్టన్ కాలేజీ యెదుట 12 మంది బాలికలు నిషిద్ధ కరపత్రములను పంచిపెడుతూవుండగా వారినందరినీ అరెస్టుచేశారు. ఈ నేరమునకే సెయింటు సేవియరు కాలేజీపద్ద యిద్దరు బాలికలను అరెస్టుచేశారు.

5000 రూపాయలు సామూదాయకపు జుర్మానా

తూర్పుఖాండేషుజిల్లాలో షెందురాణీ గ్రామంలో ముస్లిములు, ప్రభుత్వోద్యోగులు, ప్రభుత్వంవారి సహాయులు తప్ప తక్కిన ప్రజలంటరు కలిసి జుర్మానాకింద 5000 రూపాయిలు చెల్లించవలెనని దొరతనంవారు వుత్తరువుచేశారు. ఈ గ్రామంలో అల్లరులు జరిగినప్పుడు ప్రజలు గ్రామ చావిడి, పాఠశాల పంచాయితీ కచేరీ, పోస్టాఫీసు మొదలైన వాటికి నష్టమును కలిగించారు. రైలుమార్గములలో స్లీపరులను తగులబెట్టుటకు ప్రయత్నించారు. అప్పుడు పోలీసువారు ప్రజలమీద తుపాకులను కాల్చారు.

నేడు బొంబాయి రాష్ట్రంలో మరెక్కడా అల్లరులు జరుగలేదు. (అ. ప్రె.)

ఆక్యాబువై బాంబులు

క్రొత్తఢిల్లీ, సెప్టెంబరు 9:—

బ్రిటిషువిమానములు బర్మాలేవను ఆక్యాబువై నిన్న బాంబులువేసి వచ్చెను. బాంబులు లక్ష్యమునకు సూటిగా తగిలినవి. బ్రిటిషు విమానము ఒక్కటియైనను నష్టము కాలేదు.

జ్వరపీడితులకు క్రొత్తవిశ్వాసము

కేవలము నిశ్శక్తులగుట జ్వరఫలితము. కోల్పోయినశక్తిని తిరిగి సంపాదించ లేమని తలతురు. ఈ అశక్తత ఒక్క బలహీనతవల్లనే గాదనియు దీనికి విషమే కారణమని డాక్టర్లు చెప్పుదురు.

జ్వరపువిషము రక్తములో కలిసి, అతి వేగముగా నరములలో, కంఠరములలో ప్రవేశించి వాటిని నీరసముగా జేయును. స్వల్ప కాలములో జీర్ణశక్తి తగ్గుటచేత ఏ ఘనపదార్థము సహించలేదు.

శక్తివిహీనమైన దేహమునకు శక్తిని తిరిగి చేకూర్చుటకు కావలసిన పత్తురనిచ్చు పదార్థములు హార్లిక్స్‌లో నున్నవి. ఇది జీర్ణశక్తికి ఏలాటి హాని గలుగజేయదు. లేగడకాలమును గ్గించును. సులభముగా జీర్ణమగును.

హార్లిక్స్
కోల్పోయిన శక్తి చైతన్యములనుసమకూర్చును

బహిష్టు, గర్భము మీ కారణముచే నైనను 4, 5, మాసములలో రాలిపోయినను "రుతు ప్రవర్తిని", గవర్నమెంటు రిజిష్టర్డు, నివారించును. వెల రు. 2/- పోస్టేజి 0-8-0.
సంతాన నిరోధము "పర్యతి" గవర్నమెంటు రిజిష్టర్డు గర్భములకారం. ఆరోగ్యమును, చెరపక నరకము ప్రాప్తమును కలిగించును. కాస్త్రతముగా నుండుటకు రు. 3/- శాశ్వతముగా రు. 1-8-0. పోస్టేజి వేరు. ఇంగ్లీషులో వ్రాయుడు.
KAVIRAJ R. CHAKRAVARTHY,
24, Debendra Ghosh Road(A,P,M.)Calcutta
Phone South 308.

ఆరోగ్యమైన గాలి మీకు మంచిది

—కాని
ఆరోగ్యమునకు
అంతశ్శుచి ముఖ్యమైనది

ఆరోగ్యసూత్రములు బహుకొద్ది. అతి సులభము. ముఖ్యతిమమైనది అంతశ్శుచి. ప్రతిరోజు రుచియైన ఆండ్రూస్ లివర్ సాల్టు నొకగ్లాసు పుచ్చుకొని మీ శరీరములో శుభ్రముగా నుంచుకొనుడు. పెక్కుమంది ప్రజల ప్రాణములకు సంకటముగానున్న మలబద్ధము, పైత్యము, అజీర్ణము, తదితర దిన బాధలనుండి విముక్తినొందుడు. ఈ బాధలకు కారణముగు కల్మషములను ఆండ్రూసు శుభ్రపర్చినిశ్శేషముగాసుఖవిరేచనమగునట్లుజేయును.

అంతశ్శుచికి ప్రతిదినము వాడుడు.

ఆండ్రూస్ లివర్ సాల్టు
ANDREWS LIVER SALT
ఆరోగ్యమైన పానీయము, విరేచనకారియైన టానిక్
శుభ్రపర్చును-చురుకుచేయును-హాయిగొల్పును-శక్తినిచ్చును 103

ఒర్పుగల్గి ఉండుడు



మీ చిల్లరవర్తకులతోను, మాతోను ఓర్పు గల్గియుండుడు. ఓడలలో స్థలము లేకపోవుటవల్ల నాగరికా ప్రపంచమున కంతటికిని కలిగిన కార్సు బిస్కట్లు లోటునకు మేమేమిచేయజాలము.

కాని మీరు కార్సుబిస్కట్లను పొందగల్గినప్పుడు, వాటియొక్క శ్రేష్టతను మీరు వాటిలో చూడగలరు. వాటినాణ్యదనములో కొరత చేయలేదు.

ORIGINAL BISCUIT MACHINE 1831

CARR'S TABLE WATER BISCUITS
కరకరలాడును, తేలికగానుండును, బలమునిచ్చును, రుచి నుండును.
MADE ONLY BY
Carr's of Carlisle
ENGLAND
© C557

ఒకప్పుడు మంచం పట్టెను
కాని
యిప్పుడు తిరిగి ముష్టియుద్ధపు
గోదాలో సిద్ధమైనాడు

అమృతవల్లి కషాయంతో
మీ రక్తమును శుభ్రపర్చుకొనుడు.
అది క్రొత్త రక్తమును, సత్తువను చేకూర్చును.
ఒక్క బుడ్డి రూ. 1-8-0
Kaviraj
N. N. SEN & CO, LTD.,
18/1, Lower Chitpur Road,
CALCUTTA.

ఆంధ్ర ఇన్సూరెన్సు కంపెనీ, లిమిటెడ్.
హెడ్డాఫీసు:—మచిలీపట్నం.

ఆస్తులు	.....	.....	రు. 39,35,000	0	0
భీమా నిధి	.....	.....	35,90,000	0	0
అమలులోనున్న భీమా వ్యాపారం		.....	1,91,51,833	0	0
చెల్లించిన క్లెయిముల మొత్తం		.....	7,96,083	0	0
1941 సం॥ నూతన వ్యాపారం		.....	37 లక్షలు వైగా		

ఈ ఉత్తమ భీమా సంస్థలోని పట్టా, మీ భవితవ్యమునకు రక్షరేకు వంటిది.
బ్రాంచీలు:—మద్రాసు, ఎర్నాకులం, నాగపూరు, బాహోరు, అనంతపురం, బరంపురం, బరంధరం, "బెంగాలు."
చీఫ్ ఏజెన్సీలు... ఏజెన్సీలు, ఎల్లెడలను కలవు.

ఉత్తరహిందూస్థానం పరిస్థితులు

ఢిల్లీలో అంగళ్లు మూయబడుట

స్త్రీల ఊరేగింపు ప్రదర్శనాలు

న్యూఢిల్లీ, సెప్టెంబరు 9:—

న్యూఢిల్లీలో యీదినం అనేక అంగళ్లు మూయబడెను. స్త్రీలు జాతీయపతాకములను చేతబట్టుకొని ముఖ్యవీధులలో ఊరేగిరి. ఖరిబోలీలో యీ ఊరేగింపులోనివారు మూడు ట్రాముబండ్లను అటకాయించి ప్రయాణికులను క్రింద దిగుమనిరి.

అల్లరులు జరుగగనే భీతివల్ల చాందినీచౌకులో గోపుర గడియారంవద్దను మునిసిపలు భవనాలవద్దను పోలీసులు కాపలా పెట్టబడెను.

ప్రదర్శనదార్లు రెండుజట్లు యీ గోపుర గడియారం ప్రదేశమున సాయంధరక్షకుల యెదుట జాతీయపతాకాలతో అర్భాటం చేయుచుండిరి. జిల్లా మేజిస్ట్రేటు పోలీసు సిబ్బందితో అక్కడనున్న ప్రదర్శకులు చెదరిపోవలసినట్లుగా కోరెను. ఆర్భాటకులు ఆజ్ఞావుపవదలి నగరమున వేరేస్థలమునకు వెళ్లిరి.

గోపురగడియారంవద్ద పోలీసులు యిద్దరిని అరెస్టుచేసి స్టేషనుకు తీసుకొనిపోయిరి. న్యూఢిల్లీలో ఈవారళ ఉదయం ఒక అంగడిని పికెటింగుచేసిన యొక స్త్రీ అరెస్టు చేయబడెను.

ఉత్తరువుల నుల్లంఘించి ఊరేగింపు ప్రదర్శనాలు జరిపిన సందర్భమున యిప్పటికి సుమారు 12 మంది అరెస్టు చేయబడిరి.

సాల్జిగుండీలో సుమారు 300 మంది ఒక మిల్లు భవనములో దూరి మిల్లును మూయుమంగోరి కొంత అల్లరి గావించినట్లు తెలుస్తున్నది. జిల్లా మేజిస్ట్రేటు పోలీసులు రాగానే జనసమూహము చెదరిపోయెను.

ఢిల్లీనగరప్రాంతమందు మూడు వారాల వరకు 144 సెక్షను ఉత్తరువు అమలులో నుండునట్లు జిల్లామేజిస్ట్రేటు జారీచేసియున్నాడు.

పంజాబు

ఆక్రమకరపత్రాలు ప్రచురించినందుకు కేసు

లాహోరు, సెప్టెంబరు 9:—

ఆక్రమకరపత్రాలు ప్రకటనలు ప్రచురించుచుండిన నేరమునకు కాశాజిల్లా కాంగ్రెసు అధ్యక్షుడు పండిత ప్రకాషుదేవు అతని సోదరుడు శాంతిస్వరూప్ గార్లపై లాహోరు నగర మేజిస్ట్రేటుకోర్టులో దేశరక్షణ నిబంధన 38 క్రింద కేసు తేబడెను.

కరపత్రాలు ప్రకటనలు ప్రచురించినందుకు తానొక్కడే బాధ్యుడని ప్రకాషుదేవుగారు కోర్టులో చెప్పిరి.

సరిహద్దు రాష్ట్రం

బన్నూలో 63 అరెస్టులు

పెషావరు, సెప్టెంబరు 8:—

మలిక్ అక్బరాలీ యం. యల్. ఏ. (కాంగ్రెసు) మహ్మద్ జాన్ ఖాన్ (ఏ. ఐ. సి. సి. సభ్యుడు) బన్నూ విద్యార్థుల సంఘాధ్యక్షుడు శ్రీ చేలేదాస్ గార్లును మరి 60 మందియును యీవారళ ఉదయం బన్నూలో అరెస్టుచేయబడిరి. అరెస్టుఅయిన వ్యక్తులు స్థానిక న్యూక్లీళ్లను పికెటింగుచేసినట్లు తెలుపబడుచున్నది.

సింధు

కరాచిలో 250 అరెస్టులు

కరాచి, సెప్టెంబరు 9:—

రామబాగ్‌లోను యితరచోట్లను జాతీయపతాకోత్సవాలు జరుప యత్నించినందుకు సుమారు 80 మందిని పోలీసులు అరెస్టు చేసిరి. ఈ సంఘటనలు తప్ప మధ్యాహ్నం వరకు యితర విధమైన సంఘటనలు లేకుండెను. అనేక విద్యార్థులు తమ కాలేజీలకు పాఠశాలలకు హాజరుకాలేదు. విద్యాసంస్థల యెదుట కొందరువిద్యార్థులు పికెటింగు చేసిరి. అనంతరం కొందరు విద్యార్థులు విద్యార్థినులు ఊరేగింపును జరిపిరి

కరాచిలో యీవారళ సాయంత్రంలోగా మొత్తంమీద 250 మంది అరెస్టుచేయబడిరి. వారిలో చాలామంది విద్యార్థులు, 40 మంది స్త్రీలు కలరు. యీ మొత్తమున అధిక సంఖ్యాకులు ఉదయమున మూడు ప్రభాత్ ఫేరీలవారిని పట్టుకొన్న సమయమున అరెస్టుచేయబడిరి.

కాలేజీలను స్కూళ్లను పికెటింగుచేసినపుడు కొందరు విద్యార్థులు అరెస్టుచేయబడిరి. ఇతర సంఘవాలేమీ లేదు.

అరెస్టు గావింపబడినవారిలో చాలామంది వదలివేయబడిరి. సుమారు 60 మందిని మాత్రం పోలీసులు నిర్బంధమునుంచి సైనికశాసనముండే జిల్లాలనుండి అనుమతిలేక కరాచీ వచ్చినవారిని తిరిగి ఆయాజిల్లాలకు పంపివేయుదురు. అనుమతిలేక సైనిక శాసనప్రదేశమునువదలినేరమునకు వారలపై కేసు పెట్టబడునని తెలుస్తున్నది.

బెంగాలు

ట్రాముబండ్ల సర్వీసు ఆటంకపరుచు యత్నం

కలకత్తా, సెప్టెంబరు 9:—

నగరమున ట్రాముసర్వీసును ఆటంకపరుచుటకు జనులు యింకా ప్రయత్నిస్తూనే యున్నారు. వారు మధ్యాహ్నమున కారన్ వాలిస్ వీధిలో నొక ట్రాముబండిని తగులబెట్టిరి. అనేక ట్రాముబండ్లతీగె చక్రాలను చెడగొట్టిరి. ట్రాముబండికి ఎక్కువ సప్తం కలుగకముందే మంట ఆర్పివేయబడెను.

బాంకుషాల్ వీధిలో రాజధాని ప్రధాన మేజిస్ట్రేటు కోర్టులో కాంగ్రెసు వాక్యాలు పలికినందుకు యిద్దరు అరెస్టు చేయబడిరి.

నగర పొరుగు ప్రదేశాలలో అల్లరులు జరుగలేదు. కల్లోలప్రాంతమంతటను పోలీసులకాపలా యున్నది.

ఈవారళ పోలీసులు నగరమున పలుస్థలములను దీర్ఘకాలము సోదాచేసి ముగ్గురిని నిర్బంధించిరి.

దేశరక్షణ నిబంధనలక్రింద ఒక ప్రాఫెసరును పోలీసులు అరెస్టు చేసిరి

ఢాక్కా విద్యార్థులు పాఠశాలలకు వెళ్లకపోవుట

ఢాక్కా, సెప్టెంబరు 9:—

ఢాక్కాలో అనేక విద్యాసంస్థల విద్యార్థులనేకులు తరగతులకు హాజరుకాకయున్నారు. పికెటింగువల్ల అనేక ప్రొఫెసర్లు కూడా యూనివర్సిటీలో ప్రవేశించలేకపోయిరి.

నిన్న సాయంత్రం సాక్రాఘాట్ లో నొక గడ్డిమోపు తగులబెట్టబడెను. మంటలు వెంటనే అర్పబడెను. కాని కొద్ది నష్టమేర్పడెను.

8 మందిని అరెస్టుచేయుట

బంకూరా, సెప్టెంబరు 8:—

బంకూరా కాంగ్రెసుకమిటీ అధ్యక్షునితో సహా 8 మంది నిన్న ఉదయం దేశరక్షణనిబంధనలక్రింద అరెస్టు చేయబడిరి. వారందరిని మిడ్నాపూరుజిల్లాకు తీసుకొనిపోయిరి.

తపాలాఫీసులపై దాడి

బారిసాల్, సెప్టెంబరు 8:—

రహమత్‌పూరు పోస్టు టెలిగ్రాఫు ఆఫీసును గతవారం జనులు దాడిచేసి రూ. 750 విలువగల సామానులను ఎత్తుకొనిపోయిరి. ఈ సందర్భమున యిప్పటివరకు 7 మందిని పోలీసులు అరెస్టుచేసియున్నారు.

ఆసాము

మునిసిపలు సంఘమునకు రాజీనామా

శిల్చార్, సెప్టెంబరు 8:—

శిల్చార్ మునిసిపలు సంఘ సభ్యులు శ్రీ కుషిమోహనదాస్, కుంతలాలా గుప్తాగార్లు కాంగ్రెసుపట్ల ప్రభుత్వం అవలంబిస్తున్న విధానమునకు అసమ్మతి తెలుపుచూ తమ సభ్యత్వానకు రాజీనామా నిచ్చిరి.

ఝారియా వ్యాపారస్థుని అరెస్టు

ధన్‌బాద్, సెప్టెంబరు 8:—

ఝారియాలో నొక వ్యాపారస్థుడైన శ్రీ శంకరలాలు అరెస్టుచేయబడెను. ఈ అరెస్టు దేశరక్షణ నిబంధన 129 క్రింద అరెస్టు చేసిరి. ఝారియా ధన్‌బాదులలో యింకా మరి కొందరు కూడా అరెస్టుచేయబడిరి.

మధ్యరాష్ట్రం

వర్ధాలో అరెస్టులు

వర్ధా, సెప్టెంబరు 9:—

సుమారు 50 మందిని వారిలో 7 గురు స్త్రీలను 144 సెక్షను ఉత్తరువు నుల్లంఘించినందున పోలీసులు నేడు అరెస్టుచేసిరి.

లోకలు బోర్డుల రద్దు

నాగపూరు, సెప్టెంబరు 9:—

డ్రుగ్ జిల్లా కౌన్సిలును, డ్రుగ్, బెమెటారా, పంజారీల లోకలుబోర్డులను రాష్ట్రీయ ప్రభుత్వం 6 మాసాలవరకు రద్దుచేసెను.

సం॥ రాష్ట్రం

సాముదాయిక జరిమానాలు

లక్నో, సెప్టెంబరు 9:—

బేరీలిల్లాలో కొన్ని ప్రాంతాలమీద 30 వేలు సాముదాయిక జరిమానాను గవర్నరు విధించెను. మీరట్ గాంధీ ఆశ్రమమును అక్రమసంఘమనికూడా వారు ప్రకటించిరి.

కాన్పూరులో అరెస్టులు

కాన్పూరు, సెప్టెంబరు 9:—

ఊరేగింపుజరుప యత్నించినందుకు యీదినం మధ్యాహ్నం 5 గురు కాంగ్రెసువాదులు అరెస్టుచేయబడిరి. ఊరేగింపులో చేరయత్నించిన జనసమూహమును పోలీసులు చెదరగొట్టిరి.

కరపత్రాలు పంచినందుకు ఊరేగింపులు జరుప యత్నించినందుకు మొత్తంమీద ఈ దినము 14 మంది అరెస్టు చేయబడిరి.

కాంగ్రెసువర్కరు శ్రీ రాముగారిని పోలీసులు నిన్నరాత్రి దేశరక్షణనిబంధనల క్రింద అరెస్టుచేసిరి.

దేశరక్షణ నిబంధనలక్రింద నేడు 9 మంది కాంగ్రెసువాదులు అరెస్టుచేయబడిరి. అంగళ్లు మార్కెట్లు మూయబడియున్నవి.

లక్నోలో అరెస్టు

లక్నో, సెప్టెంబరు 9:—

అమినుద్దౌలాపార్కులో నిన్న జాతీయపతాకంప్రతిష్ఠింపయత్నించిన శ్రీకృష్ణ అను కాంగ్రెసువాది జెండాను పెట్టకపూర్వమే పోలీసులచే అరెస్టు చేయబడెను.

విద్యాసంస్థల బాలబాలికలు సమ్మెచేసిరి.

అల్లరులు జరిగిన పలుగ్రామాలపై రూ. 1500 పైగా సాముదాయిక జరిమానా విధింపబడెను. కొన్ని పాఠశాలలు కళాశాలలు మామూలుగా పనిచేస్తున్నవి. నూటికి 80 మంది పిల్లలు హాజరగుచున్నారు.

లక్నో గోండాసెక్షనులో రెండురైల్వే స్టేషనులను జనసమూహము తగులబెట్టిరైల్వే ఆస్తిని నష్టపరచినట్లు వార్త తెలుస్తున్నది. పోలీసులు అనేకులను అరెస్టుచేసిరి.

శ్రీమతి రామదేవు అజన్ యింకా 5 గురికి వారు ఊరేగింపులు జరిపారను నేరమునకై చెరి రెండేండ్ల కఠినశిక్ష విధింపబడెను.

(అ. ప్రె.)

భాగల్పూరు జెయిలు తిరుగుబాటు

27 మంది ఖైదీలలో చావు 87 మందికి గాయాలు

ఇద్దరు ఆఫీసర్లను తగులబెట్టిరి

బీహారుప్రభుత్వ ప్రకటన

పాట్నా, సెప్టెంబరు 8:—

బీహారు ప్రభుత్వమువారు నేడీలాగు ఒక ప్రకటన చేశారు.

"ఈనెల 4 వ తేదీని బీహారులో భాగల్పూరు సెంట్రలుజెయిలులో 600 మంది ఖైదీలు జయిలులోనుంచి తప్పించుకొనిపోవుటకుప్రయత్నించారు. వీరితో రాజకీయఖైదీలెవరున్ను చేరలేదు. వీరందరున్ను యావజ్జీవశిక్షలను దీర్ఘకాలశిక్షలను అనుభవించవలసినవారే.

అదనము గ్రామజట్టువారు ప్రధాన ద్వారము గుండా పనిని మిత్తము జెయిలు సెలుపలకు వెళ్లబోయే టప్పుడు యీ 600 మందిన్నీ ఒక్కసారిగా వెలుపలకు పోవుటకు మొదట ప్రయత్నించారు. ఈ ప్రయత్నమును వార్డరులు సాగనియ్యలేదు. ఈ దొమ్మిలో ఒక వార్డరుకు బలమైన గాయాలు తగిలినందున అతడు చనిపోయినాడు.

తరువాత యీ ఖైదీలు ఫోర్టరీకి వెళ్లి అక్కడ డిప్యూటీ సూపరింటెండెంటును కార్డింగుమాస్టరును చావగొట్టారు, వారి ప్రాణాలు పోకమునుపే వారినిద్దరిని తగులబెట్టారు. పోర్టరీని కూడా తగులబెట్టారు. అందువల్ల ఆత్మరక్షణము కొరకు జయిలు వుద్యోగులు విధిలేక విప్లవకారులమీద తుపాకులను కాల్చారు.

అడిషనలు జిల్లా మేజిస్ట్రేటు సాయుధ పోలీసుదళముతోను బ్రిటిషు సైనికదళముతోను వెంటనే జయిలువద్దకు వచ్చారు. డివిజనలు కమిషనరున్ను జయిళ్లయిన స్పెక్టరుజనరలున్ను కూడా వచ్చారు. తిరుగుబాటునడచుటలో జయిలువుద్యోగులు ముగ్గురున్ను ఖైదీలు 28 మందిన్ని చనిపోయారు. ఖైదీలలో 87 మందికి గాయాలు తగిలాయి.

బెంగాలులో తుపాకులను కాల్చవలసివచ్చుట

ముజఫరుపూరు జిల్లాలో బెంగాలులో ఆగస్టు 24వ తేదిని కొందరు సీతమరి సబుడివిజనలఆఫీసరును అతని పార్టీవారిని చంపేశారు. ఈనెల 2 వ తేదీని ఆ గ్రామంలో మళ్లీ అల్లరి జరిగింది. జిల్లా మేజిస్ట్రేటున్ను పోలీసు యినస్పెక్టరు జనరలున్ను తుపాకులను కాల్చారు. అందువల్ల ప్రజలలో ముగ్గురు చనిపోయారు. మరి ముగ్గురికి గాయాలు తగిలాయి.

బాణాలను తయారుచేయుట

పాట్నాజిల్లాలో ఒకగ్రామములో ఒక కమ్మరియింటిని సోదాచేయగా బాణాలకు వేసే అలుసులు యినపముక్కలు, చాలా దొరికాయి. అవన్నీ కొత్తగా తయారుచేయబడినవే చాలమంది కమ్మరులను పోలీసువారు అరెస్టు చేశారు.

ఫిరంగిమందు దొరుకుట

మహాబాదుజిల్లాలో చాలా యిళ్లను సోదాచేశారు. వకనియింట్లో మూడుపౌనులు తూకముగల ఫిరంగిమందు దొరికింది.

పోలీసువారి కుటుంబములకు సహాయము

అల్లరులలో చంపబడిన పోలీసు ఆఫీసరుల కుటుంబములకు ధనసహాయము చేయుటకు ముజఫరుపూరు జిల్లాలో వక ప్రాంతంలోని ప్రజలు 500 రూపాయలను చందావల్ల వసూలుచేశారు.

రాజకీయసభను జరుపుటకు ప్రజల అసమ్మతి కొట్లాట

పాట్నా జిల్లాలో వక గ్రామంలోకి యితర గ్రామాలవారు కొందరు వచ్చి అక్కడ రాజకీయసభను జరుపగోరారు. ఆ గ్రామస్థులందు కంగీకరించలేదు. గ్రామస్థులకు యితరులకు దొమ్మియుద్ధం జరిగింది. సభ జరుగలేదు.

సబుయినస్పెక్టరును కాపాడుట

గయజిల్లాలో ప్రజలు వక పోలీసుస్టేషనుకు వెళ్లి సబుయినస్పెక్టరును కొట్టారు. అక్కడ నేమనలు వారుఫ్రాంటు నాయకుడు వెంటనే అక్కడికివెళ్లి పోలీసు సబుయినస్పెక్టరు ప్రాణములను కాపాడెను.

లండనులో విమానదాడి హెచ్చరిక

లండను, సెప్టెంబరు 9:—

లండనులో బుధవారం మధ్యాహ్నం విమానదాడి హెచ్చరిక మ్రోగెను గాని బాంబులు పడలేదు. లండనను సమీపింపకుండనే శత్రువిమానములను బ్రిటిషు విమానములు తరిమివేసెను.

ఢాక్కా జెయిలు సంఘటన

అధికార విచారణ కమిటీ నియమింపబడుట

కలకత్తా, సెప్టెంబరు 9:—

ఢాక్కా జెయిలులో ఆగస్టు 31 తేదిన జరిగిన సంఘటనగూర్చి విచారణచేయుటకొక అధికార కమిటీని నియమించుటకు బెంగాలు ప్రభుత్వం నిశ్చయించియున్నదని తెలుస్తున్నది.

ఢాక్కా డివిజను కమిషనరుతో కలిసి, బెంగాలు కారాగృహములశ్రేష్ఠ స్పెక్టరు జనరలు విచారణ జరుపగలనని ప్రభుత్వం యిప్పటికే వారిని నియమించినవని తెలుస్తున్నది. (అ. ప్రె.)

సివిలు పయనీరు ఫోర్సు

మదరాసు ప్రభుత్వంవారు ఈరాష్ట్రములో మరి రెండు యూనిటుల సివిలు పయనీరుదళమును తయారుచేయ నిశ్చయించిరి. ఇదివరకు రెండుగలవు. ఈదళములు రాష్ట్రము వెలుపలగూడ పనిచేయవలసివచ్చును. 3 యూనిటు పడమటి గోదావరి, కృష్ణ, గుంటూరు, నెల్లూరు జిల్లాలందును, 4 వ యూనిటు దక్షిణజిల్లాయందును చేర్చుకొనబడును. తాశీల్దారులు క్రొత్తవారిని చేర్చుకొనగోరబడిరి.

ప్రభుత్వంవారు తీసుకున్న మోటారులకు పన్ను లేకుండచేయుటకు ప్రభుత్వంవారు నిశ్చయించి, అద్దెపద్ధతిని పుచ్చుకున్న వాటిపై పన్ను స్వంతదారే చెల్లించాలనియు, ప్రభుత్వ యుద్ధశాఖకు కొనేసిన మోటారులపై 1-10-42 నుండి పన్ను మినహాయించబడేదనియు ప్రకటించిరి.

లకోటా ప్రశ్నలు

5 ప్రశ్నలు వ్రాసి కవరులోయుంచి సీళ్లు వేసి పంపిన దేవీమహిమచే ఫలితములను వ్రాసి మీ సీళ్లకవరు సహా పంపుటకు రు. 1-8-0.

శ్రీ సరస్వతీ జ్యోతిషాలయం, పెంపుల్ స్ట్రీట్, కాకినాడ.

మీబిడ్డ ఆరోగ్యమునకు తల్లిపాలే అవసరము

పండిత నోరి రామశాస్త్రిలవారి

క్షీరవర్ధని

తల్లిపాలను వృద్ధిచేయును

ఆయుర్వేద నిలయం, బెజవాడ.

చర్ఖాసబ్బులు

వాడుడు.

"ఇందులో క్రొవ్వు చేరదు. ఇవి చేతోత సబ్బులు. పూర్తిగా స్వదేశీవి.

గర్భ బహిష్టు

విచారణకు, దంపతి-కళ, పూర్తి లేఖరూపా, నిశ్చయముగా నమ్మదగినదిగా నుపయోగించును. శాశ్వతముగా అవుటకు రు. 4-4-0. తాత్కాలికముగా 6 మాసములకు రు. 1-4-0. ప్రాణము, మలభేదమయిన ప్రకటము. 24 గంటలలో పూర్తిప్రాణము. వెల రు. 2-5-0. అంతర్వాహిని తీసికొనబడును. ప్రత్యేక వివరపట్టు మార్కు కరపత్రములు చూడుడు. జాబులు యింగ్లీషులో వ్రాయుడు.

KAVIRAJ M. KAVYATIRTHA (Jalpaiguri)
Branch:70, CORNWALLIS ST, Calcutta.

నృపాఖండార్ధకలేహ్యం

అజీర్ణము పైత్యము వాంతులు మొదలైనవాటిని హరించి జీర్ణశక్తినికలిగించును. 15తులకు డబ్బీ రు 1 వి. పి. రు 0-7-0 పి. శ. ఏ. ఆయుర్వేదసమాజం, పెరిదేపి, నెల్లూరుజిల్లా.

1937 డిసెంబరులో, చీనా ముఖ్య పట్టణమైన నాన్కింగ్ జపానువారి వశమైనప్పుడు:—

"జపాను సైనికులు మూడు, నాలుగేళ్ల పిల్లలను తుపాకీ ముళ్లతో పొడవటం కళ్లారా చూచాను."

"రీడర్స్ డైజెస్ట్" 1938 జులై సంచికలోని వ్యాసం చుండి.

....జపానువారు ఇండియాకువస్తే- ఇంకాను..

మనమంతా విధిగా-

మతభేదాలన్నిత్యజించి

దేశీయయుద్ధరంగాన

కవిసికట్టుగా పనిచేయాలి

జపానువారినినిరోధించుటకు!

TG.CPU. 7-A.

గోకుడుపుండులోని మురికివిషము కావచ్చును

నూరి గుచ్చుకున్నా సరే పెద్దపుండు అయినా సరే ఒకటే! పుండునకు విషమును కలిగించు క్రిములను సంహరింపకపోయినచో తీవ్రమైన ఉపద్రవము కలుగవచ్చును. మీ ప్రాణమునకే అపాయము కలుగవచ్చును. ఎందులకు అనవసరముగా సాహసించుట? తగిన రక్షణ కొరకు, మంచి గుణము కలుగుటకు కూటికూర ఆయింటుమెంటును (Cuticura Ointment)ను ఉపయోగింపవలసియున్నది కూటికూర (Cuticura) రాచినచోట క్రిములుండవు. దీనిని వాడుటవలన చీముపట్టదు.

పుండ్లకు, యెర్రిమూకు, పురుగుపిటికాయలకు, గజ్జికి, విషము కలుగు పుండ్లకు, కోతలకు, కాల్పులకు, అన్ని చర్మవ్యాధులకు కూటికూర ఆయింటుమెంటును (Cuticura Ointment) ను వాడుడు.

అందరు కెమిస్టులవద్దను, బజారులలోను కొనుడు.

కూటికూర



CUTICURA OINTMENT



BY APPOINTMENT TO THE LATE KING GEORGE V.

మిక్కిలి చక్కని సామగ్రితో హిందూదేశీయుల కొరకు ఇండియాలోనే తయారైనది. 39 సం॥ల అనుభవములో అతి నిపుణముగా చేయబడిన

షాలిమార్ సరుకు

Shalimar పెయింటు కలరు వార్నీషు కంపెనీ లిమిటెడు

పోస్టు బాక్సు 136, మదరాసు

ఏజంట్సు: మెసర్స్. శ్రీపాద నరసింహమ్ బ్రదర్స్, కాకినాడ, బెజవాడ, విశాఖపట్నము, అండ్ పాలకోల్.

7 & 14 పౌనులు డబ్బాలులోను 28 & 56 పౌనులు డ్రమ్ములలోను దొరకును

SP57

Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu Chetty Street Madras.